నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

1

బుధవారం | 29 జనవరి 2025 | www.navatelangana.com



జయప్రదంగా ముగిసిన సీపీఐ (ఎం) రాష్ట్ర మహాసభలు

- 4 రోజులు కష్టపడి పనిచేసిన ఆహ్వాన సంఘం
- మహాసభల నిర్వహణ బేష్ అన్న ప్రతినిధులు,నాయకులు
- రెడ్ సైల్యూట్ టూ రిసిప్షన్ కమిటీ
- రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ ఏకగ్రీవ ఎన్నికలు
- 15 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డిలో ఈ నెల 25.-26 తేదీల్లో జరిగిన సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలు అత్యంత జయప్రదంగా ముగిశాయి. సంగారెడ్డిలోని సీతారాం ఏచూరి నగర్‌లోని మల్లు స్వరాజ్యం ప్రాంగణం (గోకుల్ గార్డెన్)లో రాష్ట్ర మహాసభల్ని విజయవంతంగా నిర్వహించారు. రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో అద్భుతమైన ఏర్పాట్లు చేశారు. 300 మంది వాలంటీర్లు, 4 ప్రత్యేక కమిటీలు రాత్రింబవళ్లు కష్టపడి పనిచేశారు. మహాసభల్లో ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంగారెడ్డి జిల్లా పార్టీ శక్తివంచన లేకుండా కృషి చేయడంతో మహాసభలకు వచ్చిన ప్రతినిధులు, జాతీయ, రాష్ట్ర నాయకులు ఆహ్వాన సంఘం కృషిని అభినందించారు. సంగారెడ్డి జిల్లా పార్టీ నాయకత్వం, కార్యకర్తల పని బలమైన ఉద్యమాలున్నా జిల్లాలకు తీసిపోని పద్ధతిలో నడిపారు.

మహాసభల్లో లోతైన చర్చలు

సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలు మంగళవారం ముగిశాయి. ఈ నెల 25 బహిరంగ సభ, 26-28 తేదీల్లో ప్రతినిధుల సభలు గోకుల్ గార్డెన్‌లో జరిగాయి. ప్రతినిధులను అధ్యక్షవర్గం, స్టీరింగ్ కమిటీ క్రమశిక్షణగా నడిపింది. గత మూడేళ్ల కాలంలో చేసిన పోరాటాలు అనుభవాలు, విజయాలతో పాటు లోపాల్ని సైతం మహాసభల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చించారు. మహాసభల్లో రైతులు, కార్మికులు, పేదలు, దళితులు, గిరిజనులు, మైనార్టీలు, ఇళ్ల స్థలాలు, భూ నిర్వాసితులు, నిరుద్యోగం, కనీస వేతనాలు, మహిళలకు రక్షణ, వైద్యం, విద్య ప్రయివేటీకరణ, సామాజిక న్యాయం వంటి కీలకమైన అంశాలపై లోతైన చర్చలు జరిపారు. ఆ అంశాలపై రాబోయే కాలంలో పోరాటాలు చేసేందుకు అవసరమైన ఉద్యమ కర్తవ్యాలను సైతం రూపొందించారు. తమ్మినేని వీరభద్రం పెట్టిన కార్యదర్శి నివేదికపై జిల్లాలు, రంగాల వారిగా చర్చించారు. అదే విధంగా పలు తీర్మానాలు చేశారు. పార్టీ జాతీయ సమన్వయ కర్త ప్రకాశ్‌కరత్, పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, విజయరాఘవన్ హాజరై పార్టీ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. పలువురు కేంద్ర కమిటీ సభ్యులు పరిశీలకులుగా పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సీపీఐ(ఎం) మహాసభలకు హాజరై సౌహార్ధ సందేశమిచ్చారు. రాబోయే కాలంలో వామపక్ష ఐక్య పోరాటాలను బలోపేతం చేయాలని పిలుపు నిచ్చారు.

రెడ్ సైల్యూట్ టు ఆహ్వాన సంఘం

సంగారెడ్డి ఉద్యమం చిన్నదే అయినప్పటికీ రాష్ట్ర మహాసభల్ని మాత్రం అద్భుతంగా నిర్వహించారు. రెండు నెలల పాటు పార్టీ యావత్ మహాసభల నిర్వహణ కోసం కష్టపడి పనిచేశారు. ఆహ్వాన సంఘం చైర్మన్ చుక్క రాములు, వైస్ చైర్మన్ జే.మల్లిఖార్జున్, ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి జయరాజుతోపాటు ఆహ్వాన సంఘం సభ్యులంతా మహాసభల కోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. నాలుగు రోజుల పాటు రుచికరమైన భోజన పదార్ధాలను అందించడంతో ప్రతినిధులు, నాయకులు శబాష్ అన్నారు. మహాసభల ప్రాంగణం అలంకరణ, జాతీయ, రాష్ట్ర నాయకులు, ప్రతినిధులకు వసతి, ట్రాన్స్‌పోర్ట్ ఏర్పాట్లు, అన్ని రకాల పనులు చేసేందుకు ఉక్కు క్రమశిక్షణ కల్గిన 500 మంది వాలంటీర్స్ కృషి చేశారు. ఆహ్వాన సంఘం కృషిని అభినందిస్తూ మహాసభ ముగింపులో "రెడ్ సైల్యూట్ టు రిసిప్షన్ కమిటీ" అంటూ పిడికిలెత్తి సెల్యూట్ చేశారు. నాలుగు రోజుల పాటు ఫుడ్ కమిటీ పర్యవేక్షణలో అందించిన టిఫిన్, టీ, స్నాక్స్, భోజనం, స్వీట్స్ ఎంతో శుచిగా రుచికరంగా ఉన్నాయని ప్రతినిధులు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలో సీపీఐ(ఎం) కార్మిక వర్గం కేంద్రంగా ఉద్యమాలు నడుపుతోంది. పారిశ్రామిక కార్మికులు పెద్ద ఎత్తున మహాసభల నిర్వహణ పనుల్లో క్రమశిక్షణగా సేవలందించం వల్లనే మహాసభలు సక్సస్‌గా జరిగాయి. కార్మిక వర్గ ఆత్మీయ ఆతిధ్యం సూపర్ అని ప్రతినిధుల పేర్కొన్నారు.

మహాసభల సక్సస్‌కు కార్మికుల కృషి

సంగారెడ్డిలో జరిగిన రాష్ట్ర మహాసభలు ఏలోటు లేకుండా సక్సస్ కావడానికి పారిశ్రామి రంగ కార్మిక కృషి అభినందనీయం. శాండ్విక్, సీబీఎల్, తోషిబా, పెప్సీ, పెన్నార్, కిర్బీ ఇతర అనేక పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు నాలుగు రోజుల పాటు అక్కడే ఉండి వాలంటీర్స్‌గా పనిచేశారు. మహాసభలకు హాజరైన ప్రతినిధులు, నాయకులకు మూడు రోజుల పాటు భోజనం, వసతులు, పంక్షన్‌హాల్, అలంకరణ ఖర్చుంతా కార్మికులు తమ వేతనాల్లోంచి ఆర్థిక సహకారం అందజేశారు. 50 వేల కుటుంబాల్ని కలిసి మాస్ ఫండ్స్ క్యాంపెయిన్ చేయడంలోనూ సంగారెడ్డి పార్టీ కొత్త అనుభవాల్ని పొందించింది.

సీపీఐ(ఎ) రాష్ట్ర కమిటీ సభ్యులుగా గొల్లపల్లి జయరాజు

మల్లన్నసాగర్, నిర్వాసితుల పోరాటాల్లో క్రియాశీల పాత్ర

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి



సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులుగా గొల్లపల్లి జయరాజు ఎన్నికయ్యారు. సంగారెడ్డిలో జరిగిన రాష్ట్ర 4వ మహాసభలు మంగవారం ముగిశాయి. చివరి రోజున రాష్ట్ర నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంగారెడ్డి జిల్లా నుంచి పార్టీ జిల్లా కార్యదర్శిగా ఉన్న గొల్లపల్లి జయరాజు తొలిసారిగా రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. విద్యార్థి ఉద్యమంలోనే ఎస్ఎఫ్ఐ నాయకుడుగా పనిచేశారు. వామపక్ష బావజాలంతో సీపీఐ(ఎం) సిద్ధాంతాల పట్ల ఆకర్షితులయ్యారు. ప్రజా ఉద్యమాల్లోనే పూర్తి కాలం పనిచేయాలనే లక్ష్యంతో సీపీఐ(ఎం) పూర్తికాలం కార్యకర్తగా మారి పార్టీలో వివిధ బాధ్యతల్లో పనిచేశారు. ముఖ్యంగా మల్లన్నసాగర్ నిర్వాసితుల పోరాటంలో సమరశీలంగా పనిచేశారు. కేసుల పాలై జైలుకు సైతం పోయారు. రైతు సంఘం జిల్లా, రాష్ట్ర బాధ్యలు నిర్వహించిన జయరాజు సంగారెడ్డి జిల్లాలో భూ సమస్యలపై ఉద్యమాలు నడిపారు. ఆ తర్వాత సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శిగా రెండు మహాసభల్లో ఎన్నికయ్యారు. ఇటీవల జహీరాబాద్‌లో జరిగిన పార్టీ జిల్లా మహాసభలో రెండోసారి జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన ఆయన నాయకత్వంలో పార్టీ రాష్ట్ర 4వ మహాసభల్ని జయప్రదంగా సంగారెడ్డిలో నిర్వహించారు. జిల్లా కార్యదర్శిగా ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉన్న జయరాజు పార్టీ రాష్ట్ర కమిటీకి ఎన్నికైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డిలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో ప్రజా సమస్యల్ని చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఇళ్ల స్థలాలు, భూ నిర్వాసితులు, కార్మికులకు కనీస వేతనాలు, పేద, మధ్య తరగతి ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాల్ని ఉధృతం చేయాలని మహాసభ పిలుపు నిచ్చిందన్నారు. పార్టీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేదుకు కృషి చేయాలని పార్టీ మహాసభ నిక్కి చెప్పిందన్నారు. అలాంటి కార్యచరణతో పార్టీ విస్తరణ కోసం కృషి చేస్తానన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా చుక్క రాములు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి



సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా చుక్క రాములు తిరిగి ఎన్నికయ్యారు. సంగారెడ్డిలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో చివరి రోజున రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైంది. 15 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం, 60 మందితో రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అందులో సీనియర్‌గా ఉన్న చుక్క రాములు మరో సారి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో కార్మికోద్యమ నేతగా ఉన్న చుక్క రాములు రాష్ట్ర కేంద్రంలో ప్రజా సంఘం బాధ్యతలు చూస్తునే ఉమ్మడి మెదక్ జిల్లా పార్టీ గైడర్‌గా ఉన్నారు. పారిశ్రామిక కార్మిక వర్గంలో విశేష ఆధరణ ఉన్న చుక్క రాములు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎన్నిక కావడంతో జిల్లాలోని పార్టీ శ్రేణులు, కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ విస్తరణ, నిర్మాణం కోసం పార్టీ నూతన పోరాటా కర్తవ్యాలను అమలు చేయాల్సి ఉందన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులను సంఘటితం చేసి అనేక పరిశ్రల్లో యూనియన్లు పెట్టి జీతభత్యాలను సాధించామన్నారు. రైతులు, పేదలు, దళితులు ఇతర పేదల సమస్యలపై పోరాటాలు చేయాలని మహాసభలలో పలు తీర్మానాలు ఆమోదించినట్లు తెలిపారు. మహాసభల్లో ఇచ్చిన పోరాట కర్తవ్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి కొనసాగుతుందన్నారు. సంగారెడ్డిలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర మహాసభలు జయప్రదంగా జరిగేందుకు సహకరించిన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

శభాష్ అనిపించుకున్న భోజన ఏర్పాట్లు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఫుడ్ కమిటీ ఆధ్వర్యంలో వివిధ కంపెనీలు ఏర్పాటు చేసిన భోజన ఏర్పాట్లను చూసి మహాసభకు హజరైన ప్రతినిధులు, నాయకులకు అద్భుతంగా ఉన్నాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వాలంటీర్లు ఆహ్వానితులతో శభాష్ అనిపించుకున్నారు. అందరూ మెచ్చుకోదగిన రీతిలో ఆహార పదార్ధాలను అందించారు. అందుకోసం ఫుడ్ కమిటీ ఎంతో కష్టపడింది. నాయకులు, ప్రతినిధులకు మూడు రోజులుగా అత్యంత రుచికరమైన వివిధ రకాలైన వంటలను చేసి అందించారు. వెజ్, నాన్‌వెజ్ వంటలతో అదరగొట్టారు. టిఫిన్, టీ, స్నాక్స్, చికెన్, మటన్ బిర్యానీ, కూరగాయలతో రుచికరమైన కూరలు, సాంబర్, పెరుగు, రెండు మూడు రకాల స్వీట్స్, ఫ్రూట్ సలాట్, పాన్, వాటర్ ఇలా తినలేనంతగా వంటలు చేసి పెట్టారు. ఫుడ్ కమిటీ ఇంచార్జీగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.సాయిలు బాధ్యతలు చూశారు. టిఫిన్, భోజనాలు, స్నాక్స్, టీ సరఫరా చేసే విషయంలో చాలా క్రమశిక్షణతో చేశారు. పాండురంగారెడ్డి, బాగారెడ్డి పర్యవేక్షణలో కిచెన్ పనులన్నీ చక్కబెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన నాయకులకు రుచి, శుచితో కూడిన ఆహార పదార్ధాలను ఎంపిక చేయడం, వంటలు చేయించడం, సమయానికి వడ్డించడం కోసం శ్రీనివాస్ ఎంతో కష్టపడ్డారు. రాత్రింబవళ్లు వంటల విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చి వండిన వంటలను ముందుగానే రుచి చూసి అందరికీ నచ్చేలా చేయించడం కోసం ఎంతో కష్టపడ్డారు. శాండ్విక్, సీబీల్, తోషిబా ఇతర పరిశ్రమలకు చెందిన కార్మికులు అత్యంత క్రమశిక్షణతో వంట, భోజన శాలలో తమ సేవలను అందించారు.

అందోల్ పెద్దచెరువును టూరిజం హబ్‌గా తయారుచేస్తా

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

అందోల్‌లో సుడిగాలి పర్యటన

నవతెలంగాణ-జోగిపేట



అందోల్ పెద్దచెరువును టూరిజం హబ్‌గా తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నానని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆందోల్‌లో మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. అందులో భాగంగా అందోల్ గ్రామంలోని 1141 సర్వే నెంబర్ గల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబం ధించి ప్రభుత్వ స్థలాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. నవోదయ పాఠశాల, ఇందిరమ్మ ఇండ్లు స్థలం లేని వారికి ఇండ్ల స్థలం నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. రాబోయే రోజులలో అందోల్‌ను ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి చేసే బాధ్యత తనపై ఉందన్నారు. అందోల్ చెరువు కట్టపై సిసి రోడ్లు, బటర్ఫై లైట్లు, పార్కులు, చెరువులో బోటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. నిలిచిపోయిన పనులను వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆర్డీవో కార్యాలయంలో అధికా రులతో అందోల్ మండల అభివృద్ధి పనులపై సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అందోల్ ఆర్డీవో పాండు, అందోల్ తహసిల్దార్ విష్ణు సాగర్, ఉప తహసిల్దార్ మధుకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఆర్ అండ్ బి డిప్యూటీ ఈఈ రవీందర్, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుపతి కుమార్, రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ ఎస్. జగన్మోహన్ రెడ్డి, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.జగన్మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కోహిర్ మున్సిపల్ కమిషనర్‌గా ఉమా మహేశ్వర్‌రావు

నవతెలంగాణ-కోహిర్



నూతనంగా ఏర్పడిన కోహిర్ మున్సిపాల్టీ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా జహీరాబాద్ మున్సిపల్ కమీషనర్ ఎం.ఉమా మశ్వర్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శి ముహమ్మద్ మస్కిన్ నుంచి కోహిర్‌కు సంబంధించిన అన్ని రికార్డులను స్వీకరిం చారు. మున్సిపల్ కమిషనర్ వెంట టౌన్ ప్లానింగ్ అధికారి నరేష్ ఉన్నారు. ఇంజనీర్ హరీష్, జూనియర్ అసి స్టెంట్ అకౌంట్ సెక్షన్ ఆఫీసర్ లక్ష్మి తన పోస్టులను సమీ క్షించారు. కోహిర్ ప్రజలకు వారంలో 3 రోజులు మాత్రమే కమిషనర్ అందుబాటులో ఉంటారని.. ఇతర అధికారులు కోహీర్‌లో మాత్రమే ఉంటారన్నారు. వారంలో 2 రోజులు కోహిర్ మున్సిపాల్టీ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి జహీరాబాద్, సదాశివపేటవంటి ప్రాంతాలను సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహమ్మద్ ముజఫర్ హుస్సేన్, నాయకుడు మహ్మద్ అబ్దుల్ సత్తార్, మాజీ ఉప సర్పంచ్ కోహీర్, మహమ్మద్ ఫిర్దౌస్ సర్వర్, మహ్మద్ అజారుద్దీన్, ముహమ్మద్ మొయి నాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్‌లో మళ్లీ హైడ్రా

పద్మావతి లేఔట్‌లో కూల్చివేతలు

ఏపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని ఫెన్సింగ్ తొలగింపు

నవతెలంగాణ-అమీన్‌పూర్



హైడ్రా కూల్చివేతలు మళ్లీ మొదలయ్యాయి. సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్ పద్మావతి లేఔట్‌లో గల అక్రమ కట్టడాలను అధికారులు మంగళవారం నేలమట్టం చేశారు. ఏపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి చెందిన ఫెన్సింగ్‌ను తొలగించారు. ప్రహరీ గోడను గతంలో అధికారులు కూల్చివేశారు. అయితే తిరిగి మరోసారి అక్కడ ఫెన్సింగ్‌ను నిర్మించారు. దానిపై ఐలాపూర్ రాజగోపాల్ నగర్, బందంకొమ్ము ప్రాంతాల్లో స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు మరోసారి ఫెన్సింగ్‌ను కూల్చివేశారు. అలాగే వందనపురి కాలనీలో మరికొన్ని నిర్మాణాలను కూల్చివేశారు. కాగా, అమీన్‌పూర్ పెద్ద చెరువును ఆనుకుని ఉన్న పద్మావతి నగర్ లే అవుట్.. 193, 194, 323 సర్వే నెంబర్లలో 24 ఎకరాల్లో విస్తరించి ఉన్న లే అవుట్ కబ్జాకు గురైందని బాధితులు గతంలోనే అధికారులకు ఫిర్యాదు చేశారు. రాజకీయ పలుకు బడితో చుట్టూ ప్రహరీ నిర్మించారని భాదితులు ఆరోపిస్తున్నారు. దాదాపు 2006 నుంచి ఈ అంశం పై పోరాడుతున్నామన్నారు. మొత్తం 294 ప్లాట్స్‌తో ఏర్పాటు చేసిన పద్మావతి నగర్ లే అవుట్ విషయంపై నాలుగు నెలల క్రితం బాధితులు మొదటగా హైడ్రాను ఆశ్రయించారు. సర్వే చేసి.. మూడు నెలల క్రితం చుట్టూ నిర్మించిన గోడను హైడ్రా అధికారులు కూల్చివేశారు. అయితే కూల్చివేతల తర్వాత కబ్జాదారులు కొద్ది రోజులకే ఐరన్ ఫెన్సింగ్ వేశారు. దీంతో మరోసారి బాధితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన హైడ్రా మళ్లీ కూల్చివేతల పనులను చేపట్టింది. అమీన్‌పూర్ పెద్ద చెరువుకు అనుకుని ఉన్న పద్మావతి నగర్ లేఅవుట్ 193, 194, 323 సర్వే నెంబర్లో 24 ఎకరాల్లో విస్తరించి ఉంది. రాజకీయ పలుకు బడితో లే అవుట్‌ను కబ్జా చేసి కబ్జా దారులు చుట్టూ ప్రహరీ నిర్మించారు. ఏపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రాం భూపాల్ రెడ్డి, అతని అనుచరులు కబ్జాకు పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. సుమారుగా 2006 నుంచి ఈ అంశంపై బాధితులు పోరాడుతున్నారు. ఏళ్లుగా స్థానికంగా ఎవరు పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. మొత్తం 294 ప్లాట్స్‌తో పద్మావతి నగర్ లే అవుట్ ఏర్పాటు చేశారు. గత నాలుగు నెలల క్రితం మొదటగా హైడ్రాను బాధితులు ఆశ్రయించారు. సర్వే చేసి మూడు నెలల క్రితం చుట్టూ నిర్మించిన గోడను హైడ్రా కూల్చివేసింది. అయితే హైడ్రా కూల్చి వేసిన తరువాత కొద్ది రోజులకే కబ్జాదారులు ఐరన్ ఫెన్సింగ్ వేశారు. దీనిపై మరోసారి హైడ్రా ప్రజావాణిలో బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో హైడ్రా మరోసారి కూల్చివేతలు చేపట్టింది.

కట్టెల కోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-మునిపల్లి



కట్టెలు కొట్టడానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మునిపల్లి మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగూరు ప్రాజెక్టు వద్ద జరిగింది. మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివపేట మండలం మాలపాడు గ్రామానికి చెం దిన తలారి మోహన్ ఈనెల 27న కట్టెలు కొట్టుకుని తెస్తానని ఇంటి నుండి వెళ్లా డు. తినడానికి రాకపోయేసరికి అతడి భార్య అన్నం తీసుకుని వెళ్లగా.. బూసారె డ్డిపల్లి వద్ద గల సింగూరు ప్రాజెక్టు వంతెనపై మోహన్ దుస్తులు చెప్పులు, గొడ్డలి కనిపించాయి. దాంతో మోహన్ తల్లితోపాటు గ్రామ పెద్దలకు సమాచారం ఇచ్చింది. దాంతో సింగూరు ప్రాజెక్టులో మోహన్ కోసం వలలతో జాలరులు వెతికినా జాడ లభించలేదు. దాంతో మోహన్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజేష్ నాయక్ వివరించారు. అతడి ఆచూకీ తెలిస్తే మునిపల్లిలో పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలన్నారు.

గద్దర్ కుటుంబానికి బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-పటేపల్లి



కీర్తి శేషులు గద్దర్ పట్ల కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని.. వెంటనే గద్దర్ కుటుంబానికి బండి సంజయ్ క్షమాపణ చెప్పాలని అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు దాసయ్య కేవీపీఎస్ నాయకులు జనార్ధన్ డిమాండ్ చేశారు. గద్దర్‌ను అవమానించేలా మాట్లాడిన బండి సంజయ్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించాలన్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గద్దర్ ఏనాడు పదవులకు, ప్యాకేజీలకు, పర్సంటేజీలకు లోబడలేదన్నారు. బడుగుల పైన పెత్తం దారులు కొనసాగిస్తున్న అరచకాలను అడ్డుకోవడానికి గద్దర్ తన గళాన్ని విప్పి ఆటాపాటతోనే బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. మహోన్నతమైన వ్యక్తిని బండి సంజయ్ కించ పరిచి మాట్లాడడం దుర్మార్గమన్నారు. గద్దర్ కుటుంబానికి బండి సంజయ్ క్షమాపణ చెప్పకపోతే ప్రజాదర్బార్‌కు రావాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రేగోడు మాజీ ఎంపీపీ పత్రి విట్టల్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాలవిహార్ పార్కు అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం డివిజన్లోని శ్రీనివాస్ నగర్ కాలనీలో గల బాలవిహార్ పార్కు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ పుష్ప నగేష్ అధికారులను కోరారు. డిప్యూటీ కమిషనర్ సురేష్‌తో కలిసి బాలవిహార్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలి ంచారు. చివరి దశలో ఉన్న బాలవిహార్ పార్కు అభివృద్ధి పనులు వేగవంతం చేసి మిగిలి ఉన్న కాంపౌండ్ వాల్, ఓపెన్ జిమ్, లైటింగ్ కొరకు నిధులు మంజూరు చేయిస్తే ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని కార్పొరేటర్ మరియు స్థానిక నాయకులు కోరారు. డిప్యూటీ కమిషనర్ సురేష్ స్పందిస్తూ వెంటనే జోనల్ కమిషనర్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేయించి త్వరగా బాలవిహార్ పార్క్ పూర్తి దశలో పూర్తి అయ్యే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
బుధవారం | 29 జనవరి 2025 | www.navatelangana.com

శ్రీ మార్కండేయ జయంతోత్సవానికి పులిమామిడి రాజుకు ఆహ్వానం

నవతెలంగాణ-సదాశివపేట



సదాశివపేట పట్టణంలోని శ్రీ మార్కండేయ స్వామి జయంతో త్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజుకు ఆలయ కమిటీ చైర్మెన్ చిలువేరి రవికుమార్ కరపత్రికను అందజేసి మంగళవారం ఆహ్వానించారు. తదుపరి పులి మామిడి రాజు మాట్లాడుతూ.. వచ్చే శనివారం రోజున జరిగే శ్రీ మార్కండేయ మహర్షి వారి జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే ఈ జయంతి ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాతకేరి పద్మశాలి సంఘం అధ్యక్షులు చిలువేరి రవి కుమార్, కోశాధికారి రుమాండ్ల రాజు, ప్రచార కార్యదర్శి సోమ శంకర్ మరియు పీఎంఆర్ యువసేన నాయకులు తాలెల్మ రాము, రాగం అనిల్, ఆనంద్, అఖిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దు

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి
ఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని, ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆర్టీసి సిబ్బందికి సూచించారు. నారాయణఖేడ్ డిపోలో ఆర్టీసీ సిబ్బందితో మంగళ వారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. డ్రైవర్లు ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సిబ్బందికి సూచించారు. ప్యాసింజర్లకు క్షేమంగా స్టాపల వద్ద చేర్చడంలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కాగా 20మంది సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ మల్లేషయ్య తెలిపారు. ఎలాంటి ఘటనలు జరగకుండా బస్సులో నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

108లో ఉద్యోగ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-పటాన్‌చెరు

108 గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థలో ఉద్యోగ నియామకాల కోసం ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ జనార్ధన్ తెలిపారు. ఈఎంటి పైలట్ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పైలెట్) అంబులెన్స్ డ్రైవర్ ఉద్యోగ నియామకాలకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు బీఎస్సీ లైఫ్ సైన్స్, డీఎంఎల్‌టీ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ విద్యార్హత ఉండాలన్నారు. ఏఎన్ఎం, జీఎన్ఎం మరియు పైలెట్లకు, అంబులెన్స్ డ్రైవర్లకు 108, 102 అంబులెన్స్ డ్రైవర్లకు కనీస విద్యార్హత పదో తరగతి, డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు లైట్ మోటార్ వెహికల్ బ్యాడ్జి కలిగి ఉండాలన్నారు. డ్రైవింగ్‌లో కనీసం మూడు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని సూచించార. కాగా ఇంటర్వ్యూలు ఈనెల 31న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గల 108 కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు ఒక జిరాక్స్ సెట్‌ను వెంట తీసుకొని ఇంటర్వ్యూకి హాజరవ్వాలన్నారు.

బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

నవతెలంగాణ-జహీరాబాద్

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మహాయోధుడు, ప్రజా యుద్ధ నౌక గద్దర్‌ను అవమానించేలా కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు చేశారని.. వెంటనే ఆయన్ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నియోజ కవర్గ అధ్యక్షులు బండి మోహన్ డిమాండ్ చేశారు. పీడిత వర్గాల ప్రజలను చైత న్య పరచిన గద్దర్ గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ వెంటనే క్షమా పణ చెప్పాలన్నారు. దళితుడనే ఒకే ఒక్క కారణంతో పద్మశ్రీ అవా ర్డుకు గద్దర్ అనర్హుడు అనడం మనువాది బండి సంజయ్ అవివేకమన్నారు. పీడి త వర్గాలకు బండి సంజయ్ క్షమాపణ చెప్పి.. ముక్కు నేలకు రాయాలన్నారు. లేని యెడల దళిత, పీడిత ప్రజలు ఆయన్ను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు.



బండి సంజయ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

నవతెలంగాణ-సంగారెడ్డి

కేంద్ర మంత్రి బండి సంజయ్.. గద్దర్ పట్ల చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్ అన్నారు. ఈ మేరకు స్థానిక కొత్త బస్టాండ్ వద్ద బండి సంజయ్ దిష్టిబొమ్మను బీసీ దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా బీరయ్యయాదవ్ మాట్లాడు తూ.. భూస్వామ్య దొరల అకృత్యాలపై పోరు సలిపి.. భూస్వా ములపై తిరుగుబావుటకై గలమెత్తి పెత్తం దారుల అణిచివేతపై ఆకలి పొద్దై నిలిచిన ప్రజా యుద్ధ నౌక గద్దర్‌ను హంతకుడు అని.. హంతకునికి పద్మశ్రీ ఇవ్వమని చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత సంఘాల నాయ కులు రిటైర్డ్ ప్రిన్సిపాల్ అనంతయ్య మాట్లాడుతూ.. సమాజం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గద్దర్‌ను అవమానించిన బండి సంజయ్ తెలంగాణా సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అశోక్, జైపాల్ నాయక్, పోతురాజు పవన్,ప్రకాష్,రాథోడ్ ఇమ్మయ్య నిజాముద్దీన్, బాబర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన మక్తక్యసారం ప్రజలు

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని మక్తక్యసారం గ్రామం ముంపు ప్రాంతాన్ని పర్యటక కేంద్రంగా మారుస్తానని మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించడం హర్షిణీయమని.. గ్రామస్తులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని బుదేరా చౌరస్తాలో తాజ్‌దాబా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సింగూర్ ప్రాజెక్టును టూరిజంగా తీర్చిదిద్దేం దుకు.. మునిపల్లి మండలంలోని మక్తక్యసారం బుసారెడ్డిపల్లి గ్రామాల ముంపు ప్రాంతాలను పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దు తారని ప్రకటించడం హర్షనీయమన్నారు.ఈ సందర్భంగా మంత్రికి ఎల్లవేళలా రుణపడి ఉంటామన్నారు. పర్యాటక కేంద్రంగా మార్చబడడంతో ఇక్కడి ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల శేఖర్,న్యలకంటి వీరన్న, మాజీ సర్పంచులు చంద్రయ్య, మల్లయ్య పండరి, నగేష్, అజీజ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు

అధిక దిగుబడుల కోసమే 'రైతు నేస్తం'

నవతెలంగాణ-న్యాల్‌కల్

రైతుల పంట దిగుబడులు మరింత పెంపొందించేందుకు.. జిల్లా అధికారులు ప్రతీ మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిన్నారు. అందులో భాగంగా ముంగి రైతు వేదికలో మంగళవారం జరిగిన రైతునేస్తం కార్యక్రమ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రొఫెసర్ జయశంకర్ శాస్త్రవేత్తలు రైతులు సాగు దిగుబడి, వేసవి కాలంలో పప్పు దినుసుల పంట సాగు చేసే విధంగా చూడాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాధికారి అవినాష్ వర్మ, గ్రామ విస్తరణ అధికారులు నాగేష్, సాయికిరణ్ రెడ్డి, సనిత్ రెడ్డి తదితరులున్నారు.



మల్గిలో వైభవంగా బోనాల పండుగ ..

నవతెలంగాణ-న్యాల్‌కల్

తెలంగాణ-కర్ణాటక సరిహద్దు గ్రామమైన మల్గిలో గ్రామదేవతల బోనాల పండుగ అత్యంత వైభవంగా జరుగుతున్నది. మంగళవారం జరిగిన జాతరకు కర్ణాటక ప్రాంతాలతో పాటు సమీప గ్రామాల భక్తులు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో వీధుల గుండా డప్పు చప్పులతో ఆటపాటలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి మరియమ్మ, ఉరడమ్మ గ్రామ దేవతలకు సమర్పించారు. రైతుల పాడిపంటలు.. ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం అన్నదాన ప్రసాదం అందజేశారు. నేటి(బుధవారం)తో బోనాల జాతర ముగియనుంది. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ జె.మారుతి కురుమ, గ్రామ భక్తులు ప్రజలు శివ నంద శ్రీపతి, ఆలయ కమిటీ సభ్యులు సిద్ధ రెడ్డి, భూమారెడ్డి, విట్టల్, రాజు, ప్రతాపరెడ్డి తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదాలతో.. ప్రతీయేడు 450 మంది మృతి



- ఎస్పీ చెన్నూరి రూపేష్.
- జహీరాబాద్‌లో రోడ్ సేఫ్టీ అవేర్నెస్ ప్రోగ్రాం

నవతెలంగాణ-జహీరాబాద్

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతీయేడు ఎన్నో అవేర్నెస్ కార్యక్రమాలను చేపట్టినప్పటికీ సుమారు 450 అమాయకులు తమ అమూల్యమైన ప్రాణాలను కోల్పో తున్నారని జిల్లా ఎస్పీ చెన్నూరి రమేష్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఎస్ కన్వెన్షన్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మెగా రోడ్ సేఫ్టీ అవేర్నెస్ ప్రోగ్రాంను మంగళవారం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ సిహెచ్ రూపేష్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పోలీసులు, వివిధ స్కూల్స్, కళాశాలల నుంచి భారీ సంఖ్యలో విద్యార్థులు, అలాగే కార్మికులు, ఆటో డ్రైవర్లను పిలిపించి రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే పరిణామాల గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. వాహనాలు నడిపేటప్పుడు సీటు బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. డ్రంకన్ డ్రైవ్ చేయొద్దని, బైక్ నడిపే సమయంలో తప్పనిసరిగా లైసెన్స్ వెంట తెచ్చుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ పెట్టుకో వాలన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటిం చాలని కోరారు. మితిమీరిన వేగంతో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని సూచించారు. జిల్లాలో రెండు జాతీయ రహదారులపై 12. ఆక్సిడెంట్ స్పాట్‌లను గుర్తించి వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకుం టున్నట్టు తెలిపారు. ట్రాఫిక్ నియ మాలను పటిస్తామని విద్యార్థులు, డ్రైవర్లు, పోలీస్ సిబ్బం దితో ప్రతిజ్ఞ చేయించారు. జహీరా బాద్ నియోజకవర్గంలో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పో యిన వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందిం చారు. క్షణిక ఆవేశంలో, తాగిన మైకంలో, ఇంట్లో తగా దాలతో వాహ నాలను వేగంగా నడిపి ఎంతో మంది తమ ప్రాణాలను కోల్పో తున్నా రని.. ఇది ఎంతో బాధాకరమైన విషయమన్నారు. జహీరాబాద్ పోలీ సుల పనితీరు బాగుందని.. అవేర్నెస్ కార్యక్రమాలతో పాటు నేరాలను అదు పు చేసేందుకు చేపడుతున్న కృషి అభినందనీయమన్నారు. డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలను చేపడుతు న్నామన్నారు. ఉదయం, సాయంత్రం, మధ్యాహ్నం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడంతోపాటు ప్రత్యేక తనిఖీలను కూడా చేపడుతు న్నామన్నారు. అనంతరం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డిని మెమొంటోతో ఎస్పీ సత్కరించారు. కళాకారుల ఆటపాటలతో రోడ్ సేఫ్టీ నియమాలపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శ సాగింది. సభ నిర్వహణకు సహకరించిన కళాకారు లకు వివిధ రంగాల వారికి ఎస్పీ శాలువాతో సన్మానించి అభినందిం చారు. ఈ కార్యక్రమంలో సిఐ శివలింగం, హనుమంతు, ఎంవిఐ వెంకట్, ఎస్సైలు కాశీనాథ్, ప్రసాద్ రావు ,రవీందర్ రెడ్డి, సతీష్, రాజ శేఖర్, సంగమేశ్వర్, రమేశ్వర్, శ్రీనివాసరెడ్డి, వివిధ కళాశాలలు, పాఠశాలల నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



టౌన్ ప్లానింగ్ అధికారికి ఉత్తమ అవార్డు

నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపాల్టీలో టౌన్ ప్లానింగ్ అధికారి పవన్‌కు ఉత్తమ అవార్డు లభించింది. ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను ఈ అవార్డును కలెక్టర్ క్రాంతి వల్లూరు చేతుల మీదుగా అందుకున్నారు. టీపీఓ పవన్ కుమార్ అమీన్‌పూర్ మున్సిపాలిటీతో పాటు మరో రెండు మున్సిపాల్టీల్లోనూ టౌన్ ప్లానింగ్ అధికారిగా విధులు నిర్వర్తిసున్నారు. అమీన్‌పూర్ మున్సిపాల్టీలో ఎల్ఆర్ఎస్, భవన నిర్మాణాల అనుమతులు వేగంగా జారీ చేయడంతో పాటు విధుల్లో యాక్టివ్‌గా ఉంటూ వస్తున్నారు. ఈ అవార్డు వచ్చిన సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ముందుకు నడిచే విధంగా ఈ అవార్డును జిల్లా అధికారుల చేతుల మీదుగా అందుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని ఇదే స్ఫూర్తితో మరింత బాధ్యతతో ముందుకు వెళ్తానన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అధికారులు సిబ్బంది, పవన్‌ను అభినందించారు.

ఆర్టీసీ సిబ్బంది నిబద్ధతతోనే సంస్థకు లాభాలు

నవతెలంగాణ-జహీరాబాద్



ఆర్టీసీలోని అన్ని విభాగాల్లో విధులు నిర్వహించే సిబ్బంది నిబ్బతతో విధులు నిర్వహిస్తున్నందువల్లనే నేడు సంస్థ లాభాల బాటలో కొనసాగుతుందని ఆర్ఎం ప్రభు లతా అన్నారు. జహీరాబాద్ డిపోలో మంగళవారం జరిగిన జాతీయ రోడ్డు భద్రత ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోనే జహీరాబాద్ డిపోకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ఇక్కడి సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించి ప్రతీ రంగంలో కూడా అవార్డులు పొంద ఎతున్నారన్నారు. ఈయేడు ఆర్టీసీలో ప్రమాదాలు తగ్గాయన్నారు. డ్రైవింగ్ చేసేటపుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుదేరా డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ మాధవి, వైస్ ప్రిన్సిపల్ స్రవంతి మాట్లాడుతూ.. ఆర్టీసీ డ్రైవర్లు ఎంతోమంది ప్రయాణికులను డ్రైవర్లు సురక్షితంగా గమ్యే స్థానాలకు చేరుస్తున్నార్కన్నారు. అనంతరం ప్రమాద రహిత డ్రైవర్లు శంకర య్య పీఎం రెడ్డి, వినోదయ్యతోపాటు ప్రయివేట్ బస్ డ్రైవర్లను శాలువా లతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిపో మేనేజర్ పీఎస్ జాకీర్ హుస్సేన్, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, గ్యారేజ్ సూపర్వైజర్ తిరుమలేష్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

స్కాలర్షిప్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రం విడుదల

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



ఆచార్య జయశంకర్ డిగ్రీ కళాశాల స్కాలర్షిప్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాన్ని స్థానిక ఆచార్య డిగ్రీ కళాశాలలో డీఎస్పీ వెంకట్ రెడ్డి చేతుల మీదుగా మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి విద్యార్థులే రేపటి పౌరులు అని.. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా కష్టపడి చదివి ముందుకు సాగాలన్నారు. ఇటీవలే జరిగిన పోలీస్ శాఖ నియామకాల్లో నారాయణ ఖేడ్ ప్రాంతం నుంచే సుమారుగా 200 మంది సెలెక్ట్ అయ్యారని గుర్తుచేశారు. ఎగ్జామ్ రాస్తున్న విద్యార్థులందరికీ అల్ ది బెస్ట్ చెప్పారు. ఈ ఎగ్జామ్స్‌లో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి వారి తదుపరి కోర్స్ పూర్తి అయ్యేవరకు కళాశాల తరుపున ఏడాదికి రూ.10,000 చొప్పున, అదే విధంగా రెండో ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.5,000 చెప్పున అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

తాడ్దాన్‌పల్లి టోల్‌ప్లాజా వద్ద ఉచిత వైద్యశిబిరం

నవతెలంగాణ-చౌటకూర్



మండల పరిధిలోని తాడ్దాన్‌పల్లి టోల్‌ప్లాజా వద్ద అశోకా బిల్డ్ కాన్ లిమిటెడ్ (నేషనల్ హైవే 161 జాతీయ రహదారి) వారి ఆధ్వర్యంలో ఎంఎస్ఆర్ హాస్పిటల్ వారు మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో రక్తదానం, కంటికి సంబంధించిన వైద్యం కంటి ఆపరేషన్లు, చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన ఆపరేషన్లు అదేవిధంగా జనరల్ మెడిసిన్ కూడా ఉచితంగానే అందిస్తున్నామని డాక్టర్ ఎం ప్రణతి తెలిపారు. డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ.. ఈఎన్‌టి సంబంధించిన మందులు ఇస్తున్నామన్నారు. ఈ క్యాంపులో గ్రామ ప్రజలు కానీ, హైవే రోడ్డుపై వెళ్లే వాహనదారులు కూడా పాల్గొనే అవకాశం ఉందన్నారు. డాక్టర్ చైత్ర మాట్లాడుతూ.. రక్తదానం చేయడంతో ఒక ప్రాణాన్ని కాపాడిన వారు అవుతారన్నారు. ఇవే కాకుండా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా తమ హాస్పటల్‌లో అన్ని రకాల ఆపరేషన్లు ఉచితంగా చేస్తామన్నారు. అంతకుముందు అశోకా బిల్డ్ కాన్ ఎస్‌పిఎం నితిన్ బోబ్డే, టోల్ ప్లాజా మేనేజర్ సర్వేష్ కుమార్ ఈ క్యాంపును ప్రారంభించారు. ఈ క్యాంపులో స్టాఫ్ నర్స్‌లు అర్చన, చంద్రకళ, నరేందర్ లు పాల్గొని వైద్యం అందించారు. ఈ కార్యక్రమంలో టోల్ ప్లాజా ఇంచార్జ్ వంశీ, మధు హైవే అంబులెన్స్ సిబ్బంది సాయిలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది, పాత్రికేయులకు ఘన సన్మానం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

గత ఐదేండ్ల సమయంలో వార్డు అభివృద్ధితో పాటు మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడిన బొల్లారం మున్సిపల్ సిబ్బంది, పారిశుద్య కార్మికులు, పాత్రికేయులను 6వ వార్డు మాజీ కౌన్సిలర్ గుండ్ల సుజాత మహేందర్ శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ పాఠశాలలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ముందుగా పారిశుద్య కార్మికుల సేవలను గుర్తిస్తూ వారికి వారి వారి చిత్రపటాలతో కూడుకున్న జ్ఞాపికలను అందిస్తూ శాలువాతో సత్కరిం చారు. మున్సిపల్ సిబ్బందికి సైతం ఇదే తరహాలో సత్కరం నిర్వహిం చారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమీషనర్ మంగతాయారు మాట్లాడుతూ.. తమ పదవి కాలంలో పనిచేసిన వారిని గుర్తించుకొని అందరిని సన్మానించడం అభినందనీయమన్నారు. అదేవిదంగా గుండ్ల సుజాత మహేందర్ రెడ్డి మరెన్నో ప్రజాహిత కార్యక్రమాలు చెసి మరిన్ని మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. బొల్లారం మున్సిపల్ రెవిన్యూ ఆఫీసర్ నరసింహులు, మేనేజర్ మల్లికార్జున స్వామి మాట్లాడుతూ.. తమతో పాటు సేవలందించిన అందరిని గుర్తించు కొని వారిని సత్కరించడం ద్వారా గుండ్ల సుజాత మహేందర్ రెడ్డి దంపతులు వారి గొప్ప మనసుని చాటుకున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పాత్రికేయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గుండ్ల సుజాత మహేందర్ మాట్లాడుతూ.. గడిచిన తమ పదవి కాల సమయంలో మున్సిపల్ సిబ్బంది, పాత్రికేయలు సహకరిం చడంతో తమ వార్డు పరిధిలో అభివృద్ధి చేయగలిగామని వారితో పాటు పారిశుద్య కార్మికులు సహాయ సహకారంతో పారిశుద్య లోపం లేకుండా చేయగలిగామన్నారు. ఇటీవల మరణించిన పారిశుద్య కార్మికుడు నరసింహ కుటుంబానికి ఆర్థిక సాయం అందచేశారు. తమ కార్యక్రమానికి అతిథ్యం ఇచ్చిన శ్రీ శ్లోకఇంటర్నేషనల్ పాఠశాల వ్యవస్థాపకుడు హరి కృష్ణా రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బాలాజీ నగర్ కాలనీ వాసులు, యువకులు,జిఎమ్ఆర్ ఫాలోవర్సు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ పట్లోల్ల రేఖ ప్రవీణ్‌కు ఆత్మీయ సన్మానం



నవతెలంగాణ-జోగిపేట

ఆందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు కౌన్సిలర్ పట్లోళ్ల రేఖ ప్రవీణ్ పదవి కాలం పూర్తి అయిన సందర్భంగా వార్డు ప్రజలు, వ్యాపారస్తులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు 10 వార్డులో మంగళవారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పదవీకాలంలో చేసిన వార్డు ప్రజల కోసం చేసిన అభివృద్ధి పనులు గుర్తుచేసుకుంటూ ఘనంగా సన్మానించారు. వార్డు అభివృద్ధి ప్రదాత అంటూ కొనియాడారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పట్లోల రేఖ ప్రవీణ్ మాట్లాడుతూ.. వార్డు ప్రజల సహకారంతో, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆశీర్వాదంతో వార్డులో పలు అభివృద్ధి పనులు, పలు సేవా కార్యక్రమాలు చేశామన్నారు. వార్డు ప్రజల సహకారం మరువలేనిదని, ఎల్లప్పుడూ తనపైన ఇలాగే ఉండాలని, నిరంతరం వార్డు ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తానన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో వార్డును అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. తనపైన నమ్మకంతో తనవెంట నడిచిన వార్డు ప్రజల అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రపు కృష్ణ, చిట్యాల మధు,శరత్ బాబు, కొశికే రాజశేఖర్,ఆకుల నందు, అనీల్, కుమ్మరి భాస్కర్,వడ్ల మనయ్య, గుండా శ్రీనివాస్,శ్రీశైలం, మల్లేశం, సుధాకర్,మోడీని రాజు, నాగరాజ్, వినయ్, మహేష్, బాబా, చండీ తదితరులు పాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో ఐక్యతతోనే అభివృద్ధి

నవతెలంగాణ-సదాశివపేట



ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్‌లు ఐక్యతతో ఉన్నప్పుడే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని సదాశివపేట ఫోటో, వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగుల విజయ్ కుమార్ అన్నారు. శ్రీకృష్ణ మందిరం ప్రాంగణంలో సంఘం సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సదాశివ పేట పట్టణ మరియు మండల గ్రామాల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ లు పాల్గొని.. వారు ఎదుర్కొం టున్న సమస్యలను తెలిపారు. ఈ విషయంపై ఏకాభిప్రాయంతో ఐక్యమత్యంగా ధరలను నిర్ణయించి ఒక్కతాటిపై నడవాల న్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగుల విజయకుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో కొత్త టెక్నాలజీల కెమెరాల కోసం లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టాల్సిన అవసరం ఏర్పడుతుందన్నారు. అందుకు అనుగు ణంగా ధరలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఫోటోగ్రాఫర్స్ అందంగా ఫోటోలు తీయడానికి.. వాటిని అపురూపంగా మార్చడానికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఫోటోగ్రాఫర్లు మ్యారేజ్ ఈవెంట్లకు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బిట్ల రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి జయచింతన్, కోశాధికారి కరుణాకర్, శ్రీనివాస్,అశోక్, నరేష్, మధు, రాము, సంగమేష్, రుమాండ్ల రాజు, నాగేష్, వీరేశం ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగం పరిరక్షణ మన బాధ్యత

నవతెలంగాణ-కొండాపూర్



'భారత రాజ్యాంగం పరిరక్షణ మన బాధ్యత' అనే అంశంపై 'సద్భావన ఫోరం' సంగారెడ్డి వారితో ఈనెల 29న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హమీద్ మొహమ్మద్ ఖాన్ హాజరవుతున్నారు. వై.అశోక్ కుమార్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, సయ్యద్ సాబెర్ అలీ, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, ఆనంతయ్య, రిటైర్డ్ డిగ్రీ కళాశాల ప్రిన్స్ పాల్ జమాతే ఇస్లామే హింద్ అధ్య క్షులు హేష్మతుల్లా ఖాన్, జిల్లా బాధ్యు లు అన్వర్ పాల్గొననున్నారని.. పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మొయిజుద్దీన్ విజ్ఞప్తి చేశారు.



క్షయ వ్యాధి రహిత గ్రామంగా మార్చడానికి కృషి

నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని అన్నారం గ్రామాన్ని క్షయ వ్యాధి రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి శాయశక్తుల కృషి చేస్తున్నామని ఎంపీహెచ్ఓ నాయిని శ్రీనివాస్ అన్నారు. గ్రామంతోపాటు ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ మంగళవారం క్షయ వ్యాధి పరీక్షలు నిర్వహించారు. 105 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించగా.. 16 మందికి క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు నిర్ధారించామన్నారు. వారికి తెమడ పరీక్ష నిర్వహించి వ్యాధి నివారణ చికిత్స చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మధుకర్, ఎంపీహెచ్ఈఓ రాజు జీఎం దేవేందర్, నర్సారెడ్డి, కృష్ణ, చందు, వసంత, ఇర్ఫానా సరిత తాజా మాజీ ప్రజా ప్రతినిధులు మద్ది ప్రతాపరెడ్డి, మేడిపల్లి మురళి సుబ్రహ్మణ్యం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ భావాలపై విద్యార్థులకు అవగాహన హర్షణీయం

- జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

నవతెలంగాణ-పెద్దశంకరంపేట



శాస్త్రీయ భావాలపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించడం హర్షణీయమని కలెక్టర్ రాహుల్ రాజ్ కొనియాడారు. మంగళవారం మండలంలోని మోడల్ పాఠశాలలో మంగళవారం విద్యాఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదర్శ పాఠశాలలో విద్యా, కళానైపుణ్యాలను వెలికి తీసే ప్రక్రియలో భాగంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులు, నమూనాలను పాఠశాల ప్రాంగణంగా ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన సుమారు 250 నమోనాలను ప్రాజెక్టులను కలెక్టర్ ఎంతో ఆసక్తిగా పరిశీలిస్తూ విద్యార్థులను ప్రశ్నిస్తూ సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల సమాధానాలను విన్న కలెక్టర్ విద్యార్థులను అభినందించారు. ఒకరినొకరు నేర్చుకునేందుకు ఈ ప్రాజెక్టు వేదిక అవుతుందని, అసలైన ఆలోచనాపరులను తెలుసుకునే అవకాశం ఉందన్నారు. పట్టుదలను పెంచుకోవాలని ఓటమికి కృంగి పోరాదని ఉత్తమ ఫలితాల దిశగా విద్యార్థిని విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వాణి కుమారి చేరెకిన్ స్రవంతి మాజీ సర్పంచులు రాజ్ రెడ్డి, శ్రీ మాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

నవతెలంగాణ-మెదక్



మెదక్ నియోజకవర్గంలోని రోడ్ల మరమ్మత్తులకు రూ.15 కోట్లు మంజూరుకు కృషి చేసిన మెదక్ ఎమ్మెల్యే మైనం పల్లి రోహిత్ రావుకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హఫీజ్ మోల్ సాబ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గుల్షన్ క్లబ్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గంలో బీటీ రోడ్ల మరమ్మతులకు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు నిధుల కొరకు ఎంతో కృషి చేశారన్నారు. నిధులు మంజూరు చేసిన సీఎంకు, మంత్రు లు కొండ సురేఖ, దామోదర్ రాజానర్సింహలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మేకల రవి, అశోక్ రెడ్డి, మంగ మోహన్ గౌడ్, ముజీబ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సునీత రెడ్డికి బడుగు బలహీన వర్గాలు అంటే చిన్న చూపు

- ప్రజా పాలనపై ఎమ్మెల్యే తప్పుడు ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోం

నవతెలంగాణ-నర్సాపూర్



బడుగు బలహీనవర్గ ప్రజలను ఎమ్మెల్యే సునీత రెడ్డి చిన్నచూపు చూస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డిలు అన్నారు. మంగళవారం నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి కేవలం ప్రోటోకాల్ పైనే శ్రద్ధ తప్ప నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధిపై లేదని వారు ఎద్దేవా చేశారు. మూడుసార్లు మంత్రిగా చేసి నర్సాపూర్ నియోజకవర్గానికి ఒరగబెట్టిందేమి లేదని వారు మండిపడ్డారు. బడుగు బలహీనవర్గాలంటే ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి చిన్న చూపు అని వారు ఆరోపించారు. రాజకీయంగా గ్రూపులుగా విడగొట్టి పాలన సాగిస్తూ పబ్బం గడుపుకుంటున్న ఎమ్మెల్యే సునీత రెడ్డి అని వారు అన్నారు. కాంగ్రెస్ పార్టీని వీడి వెళ్లిపోయి ఆమెని నమ్ముకున్న పార్టీ కాంగ్రెస్ నాయకులను నిండా ముంచి తన రాజకీయ సొంత స్వలాభం కోసం పార్టీ మారిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ,ఎమ్మెల్యే సునీత రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ద్రోహిగానే గుర్తిస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా విలువలు లేని పార్టీ అని వారు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల కోసం ప్రజా పాలన కార్యక్రమాలు గ్రామాలలో చేపడుతుంటే స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ప్రజలను అధికారులను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురుచేస్తు ప్రజా పాలన పథకాలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. ఎమ్మెల్యే సునీత రెడ్డి గౌరవాన్ని కాపాడుకొని ఉంటే మంచిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అడ్డుపడితే ప్రజా క్షేత్రంలో భారీ పరిణామాలు తప్పవని ఎమ్మెల్యే సునీత రెడ్డికి కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ప్రజా పాలన కార్యక్రమంలో సాటి మహిళా అని చూడకుండా అగౌరవపరచడం సునీత రెడ్డికి తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేశం, కరుణాకర్ రెడ్డి శ్రీనివాస్ గుప్తా లలిత నర్సింగ్ నాయక్, నవీన్ గుప్తా, ఉదయ్ కుమార్, హకీమ్, అశోక్, బీసీ సెల్ అధ్యక్షులు అశోక్ గౌడ్, నరేష్ , ఆంజనేయులు గౌడ్, రిజ్వాన్, నరేందర్ రెడ్డి, వినోద, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-పాపన్నపేట



క్రీడల్లో గెలుపోటములు సహజమని ఓడిన వారు కృంగిపోకుండా, గెలిచిన వారు గర్వపడకుండా క్రీడా స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి సూచించారు. ఈ మేరకు మండల కేంద్రమైన పాపన్నపేటలో మంగళవారం రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇందులో సీనియర్ మెన్స్, సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ క్రీడాకారుల ఎంపిక కొనసాగింది. సీనియర్ మెయిన్స్ విభాగంలో ఆసిఫ్, నిఖిల్, రాకేష్, పవన్, మేఘరాజ్, సిద్ధి రాములు, వికాస్, ప్రకాష్, లోకేష్, నరేందర్ సాయి నిహాల్, చంటి, శివకుమార్, సుమిత్ర అశ్వినితో పాటు మొత్తం 36 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు పిడి రమేష్ వెల్లడించారు, ఈ కార్యక్రమానికి నరేందర్ గౌడ్, సాయినాథ్ రావు దాతలుగా వ్యవహరించగా, అసోసియేషన్ సభ్యులు గోపాల్, కుమార్, రవి, శ్రీకాంత్ శివ శశి తదితరులు పాల్గొనగా ముఖ్య అతిథులుగా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్, హెచ్ఎం మహేశ్వర్, మండల మాజీ విద్యాధికారి మోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పొలం గట్టుపై జారిపడి రైతు మృతి



నవతెలంగాణ-వెల్దుర్తి: పొలానికి నీళ్లు పెట్టడానికేని వెళ్లి పొలం గట్టుపై నుంచి జారిపడి రైతు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేట మండలం హక్కింపేట గ్రామానికి చెందిన పత్తి చేతన్ (35) మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడని తెలిపారు. పొలం వద్దకు వెళ్లిన వ్యక్తి మధ్యాహ్నం అయిన ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని భార్య రజిత, తమ్ముడు వెంకటేష్ పొలం వద్దకు వెళ్లి చూడగా పొలంలో బోర్లపడి చనిపోయి ఉన్నాడని తెలిపారు. మృతుని భార్య రజిత ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి వెళ్లి శవ పంచాంగం నిర్వహించి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాసుపత్రి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుని తండ్రి బిక్షపతి గతంలోని చనిపోవడం జరిగిందన్నారు. మృతునికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారన్నారు.

శబాష్ పల్లి సరే.. మిగతా గ్రామాల సంగతేంటి...?

- 4 పథకాల అమలుకు మిగతా గ్రామాలకు అర్హత లేదా
- మార్చి 31 వరకు ప్రభుత్వ పథకాల కోసం ఎదురు చూడాల్సిందేనా



నవతెలంగాణ-శివ్వంపేట

ప్రభుత్వ పథకాల కోసం మొగులుకు మొఖం పెట్టి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో ఇక మార్పు మొదలైందని నాయకులు చెపుతుంటే అది ప్రజలకు అర్థం కాలేదేంటంటే..గతంలో మాదిరిగా కాదు, ప్రభుత్వ పథకాలు అన్ని గ్రామాలకు కాదు కొన్ని గ్రామాలకు మాత్రమే అందివ్వడమే మార్పు అని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు మండలానికి ఒక గ్రామంలో ఒక గ్రామం చొప్పున శివ్వంపేట మండలంలో శబాష్ పల్లి గ్రామాన్ని అధికారులు ఎంపిక చేసి గణతంత్ర దినోత్సవం సందర్భంగా లబ్దిదారులకు ప్రొసీడింగులను అందజేశారు. మండలంలో 37 గ్రామపంచాయతీలు, గిరిజన తండాలు ఉండగా ఒకే గ్రామంలో ప్రభుత్వం పథకాలను అందిస్తే మిగతా గ్రామాల ప్రజలం ఏమి అన్యాయం చేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క గ్రామంలో ఓట్లు వేస్తేనే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందా అని ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వ పథకాల అమలుకు శబాష్ పల్లి ఎంపిక కావడం నిజంగా అదృష్టమని అధికారులు, నాయకులు చెపుతుంటే మేమేం పాపం చేశామని, మిగతా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో రైతులకు రైతుబంధు సాయం పది రోజులలో అందిస్తే ప్రస్తుతం రైతు భరోసా మిగతా పథకాలు మార్చి 31 వరకు అన్ని గ్రామాలకు వర్తింపజేస్తామని, ఇది నిరంతర పక్రియ అని ప్రభుత్వ పెద్దలు చెపుతున్నాగాని, ప్రజలలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. అధికారులు సర్వేలు చేస్తుంటే, ఏస్కీమ్ అడిగిన ప్రభుత్వం జనవరి 26న అని చెపుతుంటే అది విని నిజమేనని నమ్మిన రైతుల ఆశలన్నీ ఆడియాసలయ్యాయి. మండలంలో మొత్తం 20,756 మంది రైతులు ఉంటే శబాష్ పల్లిలో 446 మందికి రైతు భరోసా, 987 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హులైతే 50 మందికి, మండలంలో 4776 మంది ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేస్తే 49 ఇండ్లు శబాష్ పల్లిలో అందిస్తే సరిపోతుందా అని ప్రజలు మండిపడుతున్నారు.

పథకాలు నిరంతర ప్రక్రియ..

ఉపతహసీల్దార్ షఫీయొద్దిన్



ప్రభుత్వ పథకాలను అందించడం నిరంతర ప్రక్రియ. దరఖాస్తు చేసుకున్న ఆన్ లైన్ ప్రకారం అర్హులైన ప్రతి లబ్దిదారులకు విచారించి సంక్షేమ పథకాలు అందిస్తాం. ఎవరు కూడ ఆందోళన చెందొద్దు.

ప్రతి రైతులకు రైతుభరోసా..

ఏఓ లావణ్య



వ్యవసాయయోగ్యమైన భూములు, పట్టాదారు పాసుపుస్తకం కలిగిన రైతులందరికి ప్రభుత్వం నుంచి అందించే పంట పెట్టుబడి సాయం రైతుభరోసా డబ్బులు అతి తొందరలో అన్నదాతల బ్యాంకు అకౌంట్లలో జమ అవుతాయి. ఎవరికైన డబ్బులు రాకుంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

మా సొసైటీలు మాకే కావాలి



- నస్కల్ రైతులు
- ఒకప్పుడు రైతులతో కలకలలాడే సొసైటీ
- నేడు దుమ్ము ధూళితో విలవిల
- సొసైటీ ఏర్పాటు చేసినట్లయితే నాలుగు గ్రామాల రైతులకు మేలు

నవతెలంగాణ-నిజాంపేట

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నస్కల్‌ను రామాయంపేట పీఏసీఎస్‌లో విలీనం చేశారు. విలీనం చేయడం వలన నాలుగు గ్రామాల ప్రజలకు అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మాది మాకే ఏర్పాటు చేయాలని మా పరిపాలన మే మే చేసుకుంటామని నస్కల్ రైతులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకప్పుడు నిత్యం రైతులతో కలకలలాడే పీఏసీఎస్ భవనము నేడు దుమ్ము ధూళి చెట్ల పొదలతో పాడుబడ్డ బంగ్లా లాగా విలవిలలాడుతోందన్నారు. నగరం, నందగోకుల్, రాంపూర్, నస్కల్ గ్రామాల రైతులకు ఈ యొక్క సొసైటీ ఉన్నప్పుడు ఎంతో సౌకర్యంగా ఉండేదన్నారు. రైతులకు విత్తనాలకు ఎరువుల బస్తాలకు సబ్సిడీ రూపంలో తీసుకోవాలన్న రామాయంపేటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో అధికారులకు పాలకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే నస్కల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు చేసేలా తగు చర్యలు చేపట్టాలని కోరుకుంటున్నామన్నారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మా యొక్క సొసైటీని

మా సొసైటీ మాకే ఏర్పాటు చేయాలి

దొంతరమైన శ్రీనివాస్, నస్కల్ వాసి



గతంలో నస్కల్ సొసైటీని రామాయంపేట సొసైటీలో విలీనం చేసినందున ఇక్కడి రైతులు ఎంతో నష్టపోతున్నారు. మా సొసైటీ మాకు ఏర్పాటు చేసినట్లయితే మా పరిపాలన మేమే చేసుకుంటామని మా గ్రామాలలో రైతులే డైరెక్టర్లు చైర్మన్లు పదవులు దక్కే అవకాశం ఉంటుంది. కాబట్టి అధికారులు స్పందించి వెంటనే మా సొసైటీ మాకు ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నాను.

నస్కల్ సొసైటీని పునరుద్ధరించాలి

పాకాల ఎల్లం యాదవ్, నస్కల్ నివాసి



నస్కల్ పీఏసీఎస్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. నాలుగు గ్రామాల ప్రజలకు అనేక ఇబ్బందులకు గురవుతున్నాము. సబ్సిడీ విత్తనాలు కానీ ఎరువు బస్తాలు కానీ తెచ్చుకోవాలంటే రామాయంపేటకు వెళ్లే పరిస్థితి లేదు. రాంపూర్ నుంచి రామాయంపేట దాదాపు 20 కిలోమీటర్ల వరకు ఉంటుంది. కావున రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే స్పందించి మా సొసైటీ మాకే ఏర్పాటు చేసేలా తగు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నాము.

ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు ముందుండి పోరాడాలి

- ఎంఇఎఫ్ నాయకులు అనంతరావు శేఖర్ రమేష్

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ కోసం మాదిగలు ముందుండి పోరాడాలని, ఎస్సీ వర్గీకరణ అమలు అయ్యేవరకు ప్రతి ఒక్కరు ముందుండి పోరాడాలని మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ నాయకులు అనంతరావు, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాచారం శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు తప్పెట్ల రమేష్‌లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బూరుపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడంతో గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం, కేక్ కట్ చేసి టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్ఇఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 30 సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేస్తున్న మంద కృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడం హర్షణీయమన్నారు. ఫిబ్రవరి 7న జరిగే వేల గొంతులు లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం ప్రతి మాదిగ కుటుంబం నుంచి డప్పు సంకనేసుకుని హైదరాబాద్‌కు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ జరిగితేనే మాదిగ ఉపకులాలకు విద్య ఉద్యోగ రాజకీయ రంగాలలో న్యాయం జరుగుతుందని తెలిపారు. ఆనంతరం మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో నూతన ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఏర్పాటు చేశారు.

కొత్తపల్లి ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక

కొత్తపల్లి ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడుగా యస్ దాసు, గ్రామ ప్రధాన కార్యదర్శిగా మనోజ్, ఉపాధ్యక్షులుగా ప్రసాద్, కార్యదర్శిగా బాబు, మొగులయ్యలు ఎన్నికయ్యారు. అదేవిధంగా ప్రచార కార్యదర్శిగా దినకర్, నవీన్, ప్రచార కార్యదర్శిగా సాయిలు, కోశాధికారిగా మైపాల్‌లను ఎన్నుకున్నట్లు మాదిగ ఉద్యోగుల సంఘం జాతీయ సహాయ కార్యదర్శి అనంతరావు, జిల్లా అధ్యక్షుడు నాచారం శేఖర్ జిల్లా ఉపాధ్యక్షుడు తప్పెట్ల రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో



మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ సహాయ కార్యదర్శి అనంతర కావు మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాచారం శేఖర్, మహేంద్ర సర్పంచ్ కవి రచయిత ఎమ్ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల రమేష్, మాజీ మెదక్ మండల వైస్ ఎంపీపీ శంకర్, జర్నలిస్ట్ సాయిలు, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు సంజీవులు, యువకులు, తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రఘు

నవతెలంగాణ-గుమ్మడిదల



గుమ్మడిదల నూతన మున్సిపల్ కమిషనర్‌గా జి.రఘు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని అనుబంధ గ్రామాల నుంచి మంగళవారం రికార్డులు స్వాధీనం చేసుకొని ఆయా గ్రామాల కార్యద ర్శులతో సమావేశం నిర్వహించారు. గుమ్మడిదల, బొంత పల్లి, వీరన్నగూడెం, దోమడుగు, అన్నారం పంచాయతీలకు సంబం ధించిన రికార్డులను అధికారికంగా స్వాధీనం చేసుకున్నారు. అకౌంటెంట్ ప్రణతి, టీపీఓ కర్ణాకర్‌లను కార్యదర్శులు శాలువాలతో సత్కరించి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు సంగీత, ఈ.రాములు, నారాయణ, ప్రత్యూష, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ రావడం హర్షణీయం



నవతెలంగాణ-కొండాపూర్

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డులపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అవార్డు గ్రహీత ఎర్రుల రవి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందకృష్ణను మాదిగల ఆశాజ్యోతి అభినవ అంబేద్కర్ అని కొనియాడారు. గత 30 ఏండ్లుగా మాదిగ జాతికి పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం అభినందనీయమన్నారు. కాగా మందకృష్ణ సారథ్యంలో ఏబిసిడి వర్గీకరణ సాధించి తీరుతామని స్పష్టం చేశారు. ఏబిసిడి వర్గీక రణ అడ్డుకుల శక్తి ఎవరికీ లేదని హెచ్చరించారు. ప్రతీ ఒక్క మాదిగ మందకృష్ణకు అండగా నిలబడి మరింత శక్తిని అందించాలన్నారు.

పాత పంటల్లోనే పోషక విలువలు



నవతెలంగాణ-జహీరాబాద్

పాత పంటల్లోనే అధిక పోషక విలువలు ఉన్నాయని కేవీకే డీడీఎస్ గృహ విజ్ఞాన శాస్త్రవేత్త హేమలత అన్నారు. జహీరాబాద్ మండలంలోని వంటల్‌గడ్డలో పాత పంటల జాతరను కొబ్బరికాయ కొట్టి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాటి నుంచి నేటి వరకు గిరిజనులు పోషక లవణాలతో కూడిన పాత ంటల ఆహార పదార్థాలే తింటుండం వల్లే.. వారు అత్యంత ఆరోగ్యంగా ఉన్నార న్నారు. కాగా అంతకుముందు భాజాబజంత్రీలతో పాత పంటల జాతరకు గ్రామ స్తులు ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు లాలీ బాయ్, చుక్కమ్మ, చంద్రు బాయ్, డీడీఎస్ సంఘం సభ్యులు మాణిక్యం, చంద్రమ్మ, పూలమ్మ, ఆడివమ్మా, శాంతమ్మ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా..

ట్రిప్పర్‌ను సీజ్ చేసిన పోలీసులు, రెవెన్యూ అధికారులు

నవతెలంగాణ- కొల్చారం



మట్టి అక్రమ రవాణా కొల్చారం మండలంలో యథేచ్ఛగా సాగుతోంది. సుమారు పది ట్రిప్పర్లకు గాను ఒకే ఒక ట్రిప్పర్‌ను పట్టుకుని కేసు నమోదు చేయడంపై పలు అనుమానాలకు తావిస్తుంది. అధికారుల కనుసన్నల్లోనే మట్టి రవాణా పెద్దఎత్తున జరుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం అర్ధరాత్రి కొల్చారం మండలంలో అక్రమ మట్టి రవాణా జరుగుతున్న విషయాన్ని స్థానికులు 100 డయల్‌కు సమాచారం ఇవ్వడంతో పోలీస్, రెవెన్యూ అధికారులు అలర్ట్ అయ్యారు. పక్క సమాచారం మేరకు అక్రమ మట్టి రవాణా చేస్తున్న ట్రిప్పర్‌ను పోతంశెట్టిపల్లి చౌరస్తా వద్ద పట్టుకుని సీజ్ చేసి మంగళవారం కేసు నమోదు చేశారు. అంతేకాకుండా వివిధ గ్రామాల శివార్లలో ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. సాధారణంగా కొండలు, గుట్టల నుంచి అయితే మైనింగ్ శాఖ లేదా చెరువుల నుంచి అయితే ఇరిగేషన్ అధికారుల అనుమతులుండాలి. అయితే ఎటువంటి అనుమతులు లేకుండానే మట్టిని అక్రమంగా రవాణా చేస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. మండల, జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉండటంతో మండలంలో విచ్చలవిడిగా లేఔ ట్లు వెలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో లేఔట్లను చదును చేయడానికి, రోడ్లు వేయడానికి మట్టిని చుట్టుపక్కల గ్రామాల నుంచి వాటి యజమానులు కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదనుగా గ్రామాల్లో స్థానికంగా ఉంటున్న నాయకులు మట్టి వ్యాపారం చేస్తున్నారు. చెరువులో నుంచి కొన్ని రోజులుగా మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్ల మట్టిని చుట్టుపక్కల ప్రైవేట్ లేఔట్లకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలపై నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అనుమతులు లేని ట్రిప్పర్‌ను సీజ్ చేశాం

తహశీల్దార్ గఫ్ఫార్



ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ మట్టి రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకుని బైండోవర్ చేసి సీజ్ చేశాం. ఇకనైనా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ మట్టి తవ్వకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవు.

విష్ణు వెంచర్ ల్యాబ్ ఫౌండేషన్ లోగో ఆవిష్కరణ

బీవీఆర్ఐటీ ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో ఒక మైలురాయి

విష్ణు విద్యాసంస్థల చైర్మన్ విష్ణు రాజు

నవతెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ పట్టణ సమీపంలోని బి.వి రాజ్ ఇంజనీరింగ్ కళాశాలలో విష్ణు వెంచర్ ల్యాబ్ ఫౌండేషన్ ఇంక్యుబేషన్ సెంటర్ లోగోను మంగళవారం విష్ణు విద్యా సంస్థల చైర్మన్ కేవీ విష్ణు రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెవి విష్ణురాజు మాట్లాడుతూ ఇంక్యుబేషన్ సెంటర్ ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులకు స్టార్టప్‌లు, ఆవిష్కరణల ఆకాంక్షలతో సాధికారత కల్పించడం, వారి వ్యవస్థాపక, వినూత్న ఆశయాలను కొనసాగించేందుకు ఒక వేదికను అందించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈవెంట్ సందర్భంగా ఈ ఇంక్యుబేషన్ సెంటర్ భవిష్యత్తులో క్యాంపస్ ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని చైర్మన్ గుర్తు చేశారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్, ఏఐసీటీఈ అందించిన ఐఐసీ ఇన్నోవేషన్ ర్యాంకింగ్స్‌లో ప్రతిష్టాత్మకమైన 4-స్టార్ రేటింగ్‌ను సాధించినందుకు బీవీఆర్ఐటీ డైరెక్టర్, ప్రిన్సిపాల్, విద్యార్థులను అధ్యాపకులను విష్ణు విద్యా సంస్థల చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే, డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, ఇన్నోవేషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం కె కౌశిక్, ఐఐసీ సెల్ ఇన్చార్జి డాక్టర్ పి చంద్ర బాబు, ఈడిసి సెల్ ఇన్చార్జి డాక్టర్ కే శ్రీనివాసరావు, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్

నవతెలంగాణ-జహీరాబాద్



ప్రయాణికురాలు బస్సులో మర్చిపోయిన ల్యాప్‌టాప్‌ను తిరిగి ఆమెకు అందజేసి ఆర్టీసీ సిబ్బంది మరోమారు నిజాయితీ చాటుకున్నారు. మంగళవారం సంగారెడ్డి సర్వీస్ బస్ నెంబర్ 3555లో ఓ ప్రయాణికురాలు ల్యాప్‌టాప్‌ను మర్చిపోయింది. అయితే సదాశివపేటలో గ్రౌండ్ బుకింగ్ చేస్తున్న సిరాజు (ఎంప్లాయ్ నెం.2386 57) ఆ ల్యాప్‌టాప్‌ను చూసి కండక్టర్ ఎండి అశ్వక్(ఎంప్లాయ్ నెం.802046)కు సమాచారం ఇచ్చాడు. ఆయన వెంటనే స్పందించి ఆర్టీసీ యాజమాన్యానికి తెలిపాడు. ఆ విషయాన్ని ప్రయాణికురాలికి తెలియజేసి.. కండక్టర్ ఎండి ఆశ్వక్, శివకుమార్ ఎంసీ, సెక్యూరిటీ సిబ్బంది సమక్షంలో ఆ ల్యాప్‌టాప్‌ను ప్రయాణికురాలికి లాప్టాప్ అందజేశారు. ఈ సందర్భంగా డ్రైవర్, కండక్టర్లను పలువురు అభినందించారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు

నవతెలంగాణ-జోగిపేట



అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని 6వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ సమక్షంలో బీఆర్ఎ స్‌లో చేరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాల యంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వార్డుకు చెంది న దాసరి మల్లేశం, ఎలగొరి నరేష్, కుమ్మరి అశోక్, బోయిని అశోక్, బద్రి లక్ష్మణ్ లు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్ లో చేరారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎంపిపి హెచ్.రామగౌడ్, బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, నాగరత్నం గౌడ్, సంతోష్, గోపాల్, లక్ష్మణ్, రొయ్యల సత్యం, శేఖర్, రాజ్ కుమార్, అశోక్, బిర్ల శంకర్, రాజు, దుర్గేశ్, కరుణాకర్, పరిపూర్ణం తదితరులు పాల్గొన్నారు.

మగ్దుంపూర్‌లో మాజీ జెడ్పీటీసీ ఆర్థిక సాయం



నవతెలంగాణ-శివ్వంపేట : మండలంలోని మగ్దుంపూర్ గ్రామంలో గత కొన్నిరోజుల క్రితం మరణించిన పంబాల మల్లేష్ కుటుంబానికి మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ గుప్త మాట్లాడుతూ ఆపదలో ఉన్న ఎంత మంది బాధితుల కుటుంబాలకైనా ఆర్థిక సహకారం అందిస్తానన్నారు. గ్రామానికి అన్నివిధాలా సహాయం అందించే మాజీ జెడ్పీటీసీ మహేష్ గుప్త గ్రామంలోని బాధిత కుటుంబాలను కూడ ఆపదలో ఆదుకోవడం పట్ల గ్రామస్తుల తరుపున మాజీ సర్పంచ్ సోము అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామకమిటీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, మాజీ వార్డుసభ్యులు కత్తి గిరిబాబు, సాబెర్, కత్తి శ్రీనివాస్, కత్తి హనుమంతు, బీఆర్ఎస్ పాల్గొన్నారు.

కాకతీయనగర్‌లో థీమ్ పార్కుకు చొరవ



నవతెలంగాణ-రామచంద్రాపురం : రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ సొసైటీ కార్యాలయం ఆవరణలో గల ఖాళీ స్థలంలో థీమ్ పార్క్ అభివృద్ధికి చొరవ చూపుతున్నామని కార్పొరేటర్ పుష్ప నగేష్ అన్నారు. హెచ్ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి కాకతీయ నగర్ కాలనీ సొసైటీ కార్యా లయం ఆవరణంలో సుమారు 3500 చెదరపు గజాల కాలనీ భూమి ఉండడంతో అక్కడ థీమ్ పార్క్ అభివృద్ధికి సహకరించాలని వినతిపత్రం అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ల సహకారంతో థీమ్ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ తెలిపారు.

పర్యావరణానికి ప్రమాదమే..



- జిల్లా పంచాయతీ అధికారి దేవకి దేవి

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ప్లాస్టిక్, కెమికల్స్ కలిగిన ప్యాడ్స్ వల్ల మహిళల ఆరోగ్యానికే కాదు, పర్యావరణానికి కూడా ప్రమాదమని జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి అన్నారు. మంగళవారం హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన ఋతు ప్రేమ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని మహిళలందరూ తడి చెత్త పొడి చెత్త హానికర చెత్త వేరు చేయడంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలని తెలియజేశారు. ప్లాస్టిక్ గ్లాసెస్,ప్లేట్స్ కి బదులుగా స్టీల్ ప్లేట్స్, గ్లాసెస్ ఉపయోగించాలని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రుతుస్రావ సంబంధమైన అలవాట్లను మార్చుకోవాలని, క్లాత్ ప్యాడ్స్ ఆరోగ్యానికి ఎంతో మంచిదని సూచించారు. మహిళల ఆరోగ్యం, డబ్బు, పర్యావరణ పరిరక్షణకై మెడికల్ గ్రేడ్ సిలికాన్‌తో తయారు చేసిన శానిటరీ కప్‌లను ఉపయోగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బంక చందు, డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి , ఎంపీఓ రమేష్ , పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా వాల్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-మద్దూరు: దూల్మిట్ట మండలంలోని జాలపల్లి, దూల్మిట్ట, గ్రామాల్లో చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఈ నెల 30న చేర్యాలలో తలపెట్టిన మహాధర్నా వాల్ పోస్టర్‌ను దూల్మిట్ట జేఏసీ కన్వీనర్ చొప్పరి సాగర్, సీపీఐ(ఎం) దూల్మిట్ట మండల కార్యదర్శి రాజు, మాజీ జెడ్పీటీసీ నాచగోని వెంకట్ గౌడ్, ఆధ్వర్యంలో మహాధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఏర్పాటు చేసే అఖిలపక్ష మహా ధర్నాను ప్రజలు స్వచ్ఛందంగా హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రాజిరెడ్డి కూతురు పెళ్లికి సీఎంకు ఆహ్వానం

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మండలం వీరన్నపేట గ్రామానికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి మంగళవారం హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఫిబ్రవరి 14న జరగనున్న తన కూతురు వివాహ వేడుకకు రావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేశారు.

పాఠశాలకు డెస్క్ బెంచ్‌లు అందజేత

నవతెలంగాణ-వర్గల్



రాణే బ్రేక్ లైనిం గ్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో సామాజి క బాధ్యతలో భాగం గా చంద్ ఖాన్ మక్త గ్రామ ప్రాథమిక పాఠశాలకు సుమారు రూ.60 వేల విలువగల డెస్క్ బెంచ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్లాంట్ హెడ్ రాజేందర్ మాట్లాడుతూ..పిల్లలకు బాల్యంలో మంచి విద్యా బుద్ధులు నేర్పినట్లైతే వారు జీవితంలో మంచి ఉన్నత స్థితులలో ఎదిగి దేశ పురోభివృద్ధికి తోడ్పడుతారని అలాగే వారు ఉన్నత చదువులు చదివి అన్ని రంగాలలో రాణిస్తారని అన్నారు. తమ పాఠశాలకు సహారాన్ని అందిస్తున్న కంపెనీ సిబ్బందికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి రెడ్డి, కనకరాజు,పిఆర్టియు మండల జనరల్ సెక్రెటరీ నరసింహారెడ్డి, కంపెనీ సిబ్బంది సురేందర్ రెడ్డి , వేణుకుమార్, పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని రాంసాగర్ గ్రామంలో పశుగాణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యులు డాక్టర్ దినేష్ రెడ్డి పశువులకు గర్భకోశ, చూడీ పరీక్షలు నిర్వహించి నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. వీఏ రఘునాథం, గోపాలమిత్ర సూపర్ వైజర్ రాంరెడ్డి, అటెండర్ నర్సింలు, గోపాల మిత్ర సతీష్ గౌడ్, నిషాని భూపతి,వరాల లక్ష్మయ్య పాడి రైతులు పాల్గొన్నారు.

నేడు వేసవి విద్యుత్ కార్యచరణపై సమీక్ష

నవతెలంగాణ-సిద్ధిపేట

రానున్న వేసవి కాలంలో పెరిగే విద్యుత్ డిమాండుకు తగ్గట్టుగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో చేపట్టిన వేసవి కాల కార్యాచరణ ప్రణాళిక పై సమీక్షించడానికి 29న నోడల్ అధికారి సాయిబాబా సిద్ధిపేటకు వస్తున్నట్లు జిల్లా విద్యుత్తు పర్యవేక్షక ఇంజినీరు చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు, వ్యాపారులకు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోపాలు ఉండకుండా చేపట్టే పనులు సకాలంలో పూర్తి చేయడంతో పాటు, సమ్మర్ లో వివిధ జిల్లాల పరిధిలో జరిగే విద్యుత్ సరఫరా తీరుతెన్నులను పరిశీలించేందుకు సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ కొంతమందిని నోడల్ అధికారులుగా నియమించారని తెలిపారు. పర్యవేక్షణ అనంతరం జిల్లా లోని ఏడీఈ, డీఈ, ఎస్ఈలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

దొంగను పట్టుకొన్న యువకులకు సన్మానం

నవతెలంగాణ-మద్దూరు



మండలంలోని గాగిలాపూర్, గ్రామంలోని శివాలయంలో సోమ వారం రాత్రి దొంగతనానికి వచ్చిన దొంగను పట్టుకొని పోలీసు లకు అప్పజెప్పిన యువకులు సకినాల బాలకృష్ణ, బసవరాజు స్వామి, కనుకుంట్ల ప్రశాంత్, తుమ్మలపల్లి సంతోష్ లను మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్, మంగళవారం వారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శివాలయంలో దొంగతనానికి పాల్పడిన దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించిన యువకుల ధైర్య సాహసాలను మెచ్చుకున్నారు. ఇలాగే ప్రతి గ్రామంలో యువత అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందిస్తే నేరాలు జరగకుండా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత యోగ శిక్షణ

నవతెలంగాణ-సిద్ధిపేటఅర్బన్



సిద్ధిపేట అర్బన్ మండలం వెల్కటూర్ ప్రాథమిక పాఠశాలలో వ్యాస మహర్షి యోగ సొసైటీ ఆధ్వర్యంలో యోగ శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైనది. శిక్షకులు తోట సంధ్య విద్యార్థులకు యోగ చేపించారు. యోగతో సంపూర్ణ మానసిక ఆరోగ్యంగా ఉంటామని సంధ్య తెలిపారు. యోగ సాధన విద్యార్థులను మంచి చురుకుగా,చదువులో మేటిగా తయారు చేస్తాయని తెలిపారు. విద్యార్థులకు మూడు రోజుల యోగా కార్యక్రమం ఉంటుందని ప్రధానోపాధ్యాయులు రాజయ్య తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయికృష్ణ,సరిత, ఉమామహేశ్వరి, నాగేందర్, లలిత, రజిత లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-ములుగు



మండల కేంద్రమైన ములుగులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పదో తరగతి 2004-2005 బ్యాచ్‌కు సంబంధించిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.20 ఏండ్ల తర్వాత విద్యార్థి, విద్యార్థులలోను ఒక్కదాటికి వచ్చి ఒకరినొకరు పలకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆనాటి గురువులు ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి, సామాన్య శాస్త్రం శ్రీనివాసరెడ్డి గురువులను ఘనంగా సన్మానించారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు


నవతెలంగాణ-గజ్వేల్



వీధి కుక్కల నియంత్రణ కార్య క్రమంలో భాగంగా గజ్వేల్ ప్రజ్ఞాపూ ర్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో వీధి కుక్కలను తీసుకెళ్లినట్లు వార్డు ఇంచార్జ్ జంగం రమేష్ గౌడ్ తెలిపారు. మంగళవారం వార్డులో పెంపుడు కుక్కల పట్ల ఇంటి యజమానులు జాగ్రత్తగా ఉండాలని అలాగే వీధి కుక్కలు సమూహం వద్ద చిన్న పిల్లలు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డుల్లో కుక్కల నియంత్రణ కోసం మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చెప్పడం జరిగిందని వార్డులో కుక్కలు సమూహం ఉన్నట్లు యితే మున్సిపల్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు జంగం బలరాం గౌడ్, నరేష్, యాదగిరి, మల్లారెడ్డి, బండ్ల స్వామి, నారాయణరెడ్డి, మున్సిపల్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన చెరకు శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-తొగుట



దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరు కు శ్రీనివాస్ రెడ్డి ఉదయం భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి కూడ వెల్లి వాగులోకి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. అలాగే కూడ వెళ్లి మాఘం అమావాస్య జాతరకు వచ్చే భక్తులకు పుణ్యస్నాల కోసం నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. నీరు విడుదల చేయాలని అధికారులను మంత్రి ఆదేశించడం తో శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు అధికారు లు కూడవెల్లి వాగులోకి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు అన్నారు. రైతులంతా అప్రమత్తం గా ఉండాలని చెరుకు శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అడిగింది తడువుగా నీటి విడుదల చేసిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

పదిలో 100-శాతం ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి



నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

కలెక్టరేట్‌లో మార్చి 21 నుండి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులకు సిద్ధం చేయడం కోసం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల, ప్రధానోపాధ్యాయు లు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌లు, కేజీబీవీల ప్రత్యేక అధికారులతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల వారిగా పదవ తరగతి పరీక్షలలో పూర్తిస్థాయిలో ఉత్తీర్ణత సాధించడం కోసం ఆయా పాఠశాలలు అనుసరిస్తున్న విధానం గురించి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వివరించా రు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు ఏండ్ల మాదిరి గానే జిల్లా పదవ తరగతి పరీక్షలో ఈ ఏడాది కూడా పై భాగంలో నిలిచేలా ప్రణాళిక బద్ధం గా విద్యార్థులను ప్రత్యేకంగా చదివించాలన్నా రు. పరీక్షల నిర్వహణకు ఇంకా నెలన్నర సమ యం మాత్రమే ఉన్నందున ప్రతి ఒక్క విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థుల వెనుకబడి ఉన్న సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివించి 100శాతం ఉత్తీర్ణత తీసుకురా వాలని అన్నారు. అన్ని సబ్జెక్టుల్లో ప్రాక్టీస్ టెస్టులు నిర్వ హించాలని విద్యార్థుల వారీగా టెస్టుల వారీగా అసైన్మెంట్ షీట్ అన్ని పాఠశాలలో ఉండాల న్నారు. అనాథలు, నిరుపేద విద్యార్థులపై వారి వ్యక్తిగత సమస్యలు ప్రభావం చూపకుం డా వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఈ నెలన్నర రోజులు విద్యార్థులు ఆబ్సెంట్ కాకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాల ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్స్, గురుకుల పాఠశాలు , కేజీబీవీ లలో 10,815 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారని వారందరూ పదవ తరగతి లో ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యా చరణ ద్వారా పరీక్షకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ప్రైవేట్ స్కూళ్లలో 3309 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతు న్నాంన్నారు. ఈ కార్యక మంలో జిల్లా ఉమ్మడి పరీక్ష సెక్రటరీ షౌకత్ అలీ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మయ్య, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి, మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజ్ఞప్తికి స్పందించిన మంత్రి

- మల్లన్న సాగర్ నుంచి కూడవెల్లి వాగులోకి నీటి విడుదల
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి ధన్యవాదములు తెలిపిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మిరుదొడ్డి/తొగుట



కూడవెల్లి వాగు లోకి నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి చేసిన విజ్ఞప్తికి స్పందించారు. మంగళవారం మంత్రిని కలిసిన కొత్త ప్రభాకర్ రెడ్డి పంట పొలాలు ఎండిపోతున్నాయని, కూడవెల్లి జాతర సందర్భంగా వాగు నీళ్ల లేక వట్టి పోయిందని, కూడవెల్లి వాగుతో పాటు రామాయంపేట, చిన్న శంకరంపేట కాలువలలోకి మల్లన్న సాగర్ జలాలు విడిచి దుబ్బాక నియోజకవర్గం లోని రైతుల పంట పొలాలు కాపాడాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి కి స్పందించిన మంత్రివర్యులు వెంటనే నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. మల్లన్న సాగర్ నుండి కూడవెల్లి వాగులోకి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని తెలిపారు. వాగు ప్రవహిస్తున్నందున వాగు పరివాహక రైతులంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. తాను చేసిన విజ్ఞప్తి కి స్పందించి నీటి విడుదల చేసిన మంత్రికి ఎమ్మెల్యే దుబ్బాక నియోజకవర్గ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చిన్న శంకరంపేట, రామాయంపేట కాలువలకు నీటిని విడుదల చేయాలని, చిన్న కాలువలను పూర్తి చేయాలని కోరారు.

దేవాలయంకు గ్రానైట్‌ను అందజేసిన హరీశ్‌రావు

- రూ.1.20 లక్షల విలువ గల గ్రానెట్ అందజేత

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్



సిద్దిపేట అర్బన్ మండలం బొగ్గులోని బండ గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మ దేవాల యంకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు రూ.1లక్షా 20 వేల విలువ గ్రానేట్‌ను విరాళంగా మంగళవారం ముదిరాజ్ కులానికి చెందిన గ్రామ ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. గ్రామంలో నిర్మిస్తున్న ముదిరాజ్ కులదైవం పెద్దమ్మ దేవాలయానికి తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని హరీశ్‌రావును ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కలిసి గ్రామ పెద్దలు కోరడంతో స్పందించిన ఆయన ఆలయ కమిటీకి తన వంతుగా గ్రైనేటును అందించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సహకారం అందించిన హరీశ్‌రావును ఆలయ కమిటీ సభ్యులు ముదిరాజ్ కుల సంఘం నాయకులు క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బైరి నర్సింలు, అందె పోచయ్య, బైరీ రాజు,అందె బాలయ్య, అందె కనకయ్య అందె చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో, ఎంపీవో కార్యాలయాల ఏర్పాటుకు భవనాల పరిశీలన



నవతెలంగాణ-మద్దూరు

నూతన మండలం దూల్మిట్ట మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు కోసం మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్, మంగళవారం భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు కోసం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య కేంద్రాన్ని, హాస్టల్, గ్రామపంచాయతీ భవనాలను పరిశీలించినట్లు తెలిపారు. గ్రామస్తుల అభిప్రాయం మేరకు ఈనెల 29న గ్రామసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వీర రాజు, పంచాయతీ కార్యదర్శులు గద్ద వెంకటేశ్వర్లు, సిద్దేశ్వర్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి: అక్బర్ పేట భూంపల్లి మండల కేంద్రంలో మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం కొరకు తహసీల్దార్ కార్యాలయము వెనకాల ఉన్నటువంటి భవనాన్ని అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ భవనంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తే మండలంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉంటుందని, ఇక్కడ తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ కార్యాలయాలు కూడా దగ్గరగా ఉన్నాయని, ప్రజలకు రవాణా పరంగా కూడా అణువుగా ఉంటుందని, అధికారులకు స్థానికులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో మిరుదొడ్డి, దుబ్బాక ఎంపీడీవోలు గణేష్, భాస్కర్ శర్మ, అక్బర్ పేట మాజీ సర్పంచ్ బుచ్చయ్య, భూంపల్లి ఎంపీటీసీ అబ్బుల ఉమారాణి బాల గౌడ్, దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



నూతన బోర్లకు శంకుస్థాపన చేసిన పూజల

నవతెలంగాణ-నంగునూరు

గ్రామాల అభివృద్ధియే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని సిద్దిపేట నియోజకవర్గం ఇంచార్జి పూజల హరికృష్ణ అన్నారు.మంగళవారం సిద్దిపేట నియోజకవర్గం నంగునూరు మండలంలో ఎస్డీఎఫ్ నిధులతో మంజూరు అయినా బోర్లకు హరికృష్ణ శంకుస్థాపన చేశారు. నంగునూరు మండలం జేపీ తండా లోని హనుమాన్ గుడి దగ్గర, రాంపూర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ వద్ద, పాలమాకుల గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హల్ దగ్గర నూతన బోర్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంచార్జి మంత్రి కొండా సురేఖ, సీఎం రేవంత్ ఆశీస్సులతో సిద్దిపేట నియోజకవర్గంలో సుమారు రూ.17 కోట్ల నిధులు తీసుకొచ్చానని తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి మండలం, ప్రతి గ్రామం అభివృద్ధి కొసం నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవులపల్లి యాదగిరి, రాపోలు రాజ బహదూర్ రెడ్డి, ఎనగందుల యాదగిరి, మాజీ ఎంపీటీసీ నితిన్ కుమార్, మండలం కాంగ్రెస్ అధ్యక్షులు తప్పెట శంకర్, తదితరులు పాల్గొన్నారు.



చట్టపరమైన అవగాహన కలిగి ఉండాలి

- డిస్ట్రిక్ లీగల్ అథారిటీ సర్వీసెస్ సెక్రెటరీ స్వాతి రెడ్డి

నవతెలంగాణ-నంగునూరు



తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి, అలాగే న్యాయం కోసం పోరాడడానికి ప్రతి ఒక్కరూ చట్టపరమైన అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమని డిస్ట్రిక్ లీగల్ అథారిటీ సర్వీసెస్ సెక్రెటరీ స్వాతి రెడ్డి సూచించారు. నంగునూరు మండలం నర్మెట గ్రామ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినిలకు చట్ట పరంగా పొందే హక్కులు, బాధ్యతలు, చట్టాలపై లీగల్ అవేర్ నెస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్వాతి రెడ్డి మాట్లాడుతూ చట్టపరమైన అవగాహన ఉన్న వ్యక్తులు తమకు జరిగిన అన్యాయాలకు వ్యతిరేకంగా న్యాయం కోసం పోరాడగలరని, చట్టాలపై అవగాహన ఉన్న సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దు అని, ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని హెచ్చరించారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీ టీమ్ నిర్వహిస్తున్న విధులు ,ర్యాగింగ్, ఈవిటీజింగ్, పోక్సోషీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాల ,గురించి రూరల్ సీఐ శ్రీనివాస్ విద్యార్థిని లకు వివరించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తరగతి గదులను, వంటగది, బాత్ రూమ్ లను, పడక గదులను, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. హాస్టల్ బాత్ రూమ్ లో నిర్వహణ సరిగా లేకపోవడం, డోర్లు విరిగిపోయి ఉండడంతో డిస్ట్రిక్ లీగల్ అథారిటీ సర్వీసెస్ సెక్రెటరీ స్వాతి రెడ్డి హాస్టల్ వార్డెన్ పై సీరియస్ అయ్యారు.ఈ కార్యక్రమంలో రాజగోపాల్ పేట ఎస్సై అసీఫ్, మాజీ ఎంపీటీసీ బాబు, సీనియర్ న్యాయవాది ఆత్మ రాములు అధ్యాపక బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

పథకాల పేరిట ప్రభుత్వం వంచన

- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్



నవతెలంగాణ-గజ్వేల్ : ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రుణమాఫీ ఇందిరమ్మ ఇళ్ల పేరిట మీద ప్రజలను వంచిస్తూ ప్రభుత్వం మోసం చేస్తుందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గజ్వేల్ మండలం అమ్మది పూర్ లో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కూడా 30 శాతం ఇచ్చి 70 శాతం మందికి ఎగనామం పెట్టాలని చూస్తున్నారన్నారు. హామీల అమలులో పూర్తి వైఫ ల్యం.మహిళలను మోసం చేస్తున్నారు. గజ్వేల్ మండలం లోని అహ్మదీపూర్ గ్రామానికి చెందిన బోయిని కరుణాకర్ రూ.60వేలు, డబ్బేట నరేష్ కు రూ.11వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సమావేశంలో ప్యాక్స్ డైరెక్టర్ చాడా శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, మాజీ కో అప్షన్ అహ్మద్, సత్య గౌడ్, అమరెందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

మౌంటైనీర్ విహాన్ రామ్‌ని అభినందించిన గవర్నర్

నవతెలంగాణ-మద్దూరు



సిద్ధిపేట జిల్లా దూల్మిట్ట మండలం హనుమ తండాకి చెందిన బాలుడు జాటోత్ విహాన్ రామ్ (అంతర్జాతీయ పర్వతారోహకుడు) (8 ఏండ్లు), గత వారం ఆఫ్రికా లోని అత్యంత ఎత్తైన పర్వతమ్ కిలిమంజారోని అధిరోహించిన సందర్భాన్ని పురస్కరించుకొని మౌంటెనీరింగ్ పట్ల బాలుడికి ఉన్న శక్తి సామర్థ్యాలను రాష్ట్ర గవర్నర్ జీష్ణు దేవ్ వర్మ రాజ్ భవన్‌కు పిలిపించుకొని ప్రశంసించారు. ఈ సందర్భంగా విహాన్ రామ్ తాను వచ్చే నెల ఆస్ట్రేలియాలోని కోషియాస్కో పర్వతాన్ని అధిరోహించనున్నట్లు గవర్నర్‌కు తెలిపాడు. అతి చిన్న వయస్సు లోనే సాహసోపేతమైన పర్వతారోహణను ఎంచుకున్నందుకు గవర్నర్ విహాన్ రామ్ ను అభినందిం చారు.ఈ కార్యక్రమంలో కోచ్ లెంకల మహిపాల్ రెడ్డి, విహాన్ రామ్ తల్లితండ్రులు వాణి- తిరుపతి నాయక్, సోదరుడు అభయ్ రామ్,స్పాన్సర్ గుగులోత్ రజిత తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం













నవతెలంగాణ-బెజ్జంకి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఇందిరమ్మ ఇండ్లు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రైతు భరోసా,నూతన రేషన్ కార్డుల జారీ చేయడంపై మండల పరిధిలోని వీరాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులు మంగళవారం సంబురాలు నిర్వహించారు. ఆ గ్రామాన్ని ప్రభుత్వం పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి పారదర్శకంగా పథకాల అమలుకు శ్రీకారం చుట్టడం హర్షనీయమని కాంగ్రెస్ నాయకుడు మిట్టపెల్లి చెన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఎమ్మెల్యే కవ్వంపల్లి చిత్రపటానికి చెన్నారెడ్డి పలువురు గ్రామస్తులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి : అక్బర్ పేట భూంపల్లి మండల కేంద్రంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను విడుదల చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ , జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ , దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, జిల్లా కార్యదర్శి ఏలూరు కమలాకర్ మాట్లాడుతూ. నిధులను విడుదల చేసినందుకు సీఎంకి, మంత్రులకు, చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి అక్బర్ పేట భూంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన, రైతుల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అక్బర్ పేట భూంపల్లి మండలం లోని రామేశ్వర పల్లి గ్రామాన్ని ఎంపిక చేసినందుకు శ్రీనివాస్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నా మన్నారు. పోతారెడ్డి పేట రెవెన్యూ పరిధిలో 2326 రైతుల కు 3402 ఎకరంలకు గాను రెండు కోట్ల నాలుగు లక్షల 14 వేల 509 రూపాయలు రైతుల అకౌంట్లో జమ అయినవి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యద ర్శి కోనాపురం బాలు, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు కోరం పల్లి యాదవ రెడ్డి,మాజీ సర్పంచ్లు గుండా శంకర్, పోతారం ప్రతాప్, పెరిక మధు, మాజీ ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

సిద్దిపేట: రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిందని, ఎన్నో సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ నెంబర్ వన్‌గా నిలిచిందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, టీపీసీసీ మెంబర్ దరిపల్లి చంద్రం అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి 4 సంక్షేమ పథకాలను అమలు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా నష్టపో యిందని, వారు మాత్రం ఆర్థికంగా అభివృద్ధి చెందారని, కాంగ్రెస్ పాలనలో ప్రజల అభివృద్ధి చెందడానికి సంక్షేమ పథకాలను తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సి లర్లు సాకీ ఆనంద్, రియాజ్, పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యాదరి మధు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గాయాసుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: ఒక్కసారి మాట ఇస్తే అది పక్కాగా అమలు జరిగి తీరుతుందని, అదే కాంగ్రెస్ సర్కార్ నైజం అని కాంగ్రెస్ దుబ్బాక మండలాధ్యక్షులు కొంగర రవి తెలిపారు. మండల పరిధిలోని బల్వంతాపూర్ లో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి,మంత్రులు మంత్రులు కొండా సురేఖ,పొన్నం ప్రభాకర్ లతో కూడిన ఫ్లెక్సీకి రైతులు,లబ్ధిదార్లు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కొంగర రవి మాట్లాడుతూ..నేడు కాంగ్రెస్ సర్కార్ చెప్పినట్లే జనవరి 26 నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా రూ.6 వేలు, ఎకరానికి రూ.6 వేల రైతు భరోసాను అందిస్తుందని స్పష్టం చేశారు. బల్వంతాపూర్ ను పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా ఎంపిక చేసిన సీఎం, మంత్రులకు, చెరుకు శ్రీనివాస్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

సిద్ధిపేటరూరల్: సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనలో రైతు రాజ్యం పాలన సాగుతుందని జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బుచ్చిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మంద పాండు అన్నారు. 4 సంక్షేమ పథకాలు అమలు పైలట్ ప్రాజెక్టు వెంకటాపూర్ గ్రామాన్ని ఎంపిక చేసినందుకు మంగళవారం సీఎం చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి న తర్వాత పేద ప్రజలకు, రైతులకు మేలు జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ముత్యా ల దేవేందర్ రెడ్డి, రాజ్ మహమ్మద్, గ్రామ శాఖ అధ్యక్షులు దుర్గయ్య, సీనియర్ నాయకులు కోదాడి మల్లారెడ్డి, తదిత రులు పాల్గొన్నారు.

దుబ్బాక: సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల్లో కాంగ్రెస్ సర్కార్ పట్ల వస్తున్న ఆదరణను చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్ ఎద్దేవా చేశారు.ఇచ్చిన మాటకు కట్టుబడే తమ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా ద్వారా ఎకరాకు రూ.6 వేలు అందిస్తుందన్నారు.4 సంక్షేమ పథకాలను అమలుచేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం దుబ్బాక పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ, తమది రైతుల మేలు కోరే ప్రభుత్వమన్నారు. మాటిమాటికి సర్కార్ పై నియోజకవర్గ ఇన్చార్జి శ్రీనివాస్ రెడ్డి పై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. పీఏసీఎస్ వైస్ చైర్మెన్ కాల్వ నరేష్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అనంతుల శ్రీనివాస్,కాంగ్రెస్ దుబ్బాక మండల అధ్యక్షులు కొంగర రవి, నాయకులు, పలువురు పాల్గొన్నారు.

రైతు భరోసా పథకం కోసం దరఖాస్తుల స్వీకరణ

-మండల వ్యవసాయ శాఖ అధికారి భోగేశ్వర స్వామి

నవతెలంగాణ-చేర్యాల



రైతు భరోసా పథకానికి సంబంధించి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి పులి భోగేశ్వర స్వామి తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఏఈఓలతో కలిసి ఏఓ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ 2025 జనవరి 1 వరకు పట్టాదారు పాస్ బుక్ ఉన్న రైతులు అర్హులని తెలిపారు. రైతు భరోసా అర్హులైన వారు పట్టా పాసుబుక్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, వ్యవసాయ అధికారులకు అందజేయాలన్నారు. మండలంలో నూతన పట్టా పాస్ బుక్ కలిగిన రైతులు 1410 ఉండగా ఒక వెయ్యి ఒక వంద పది పెండింగ్‌లో ఉన్నాయని, 292 మంది ఆన్ లైన్ చేసినట్లు తెలిపారు. పాత పట్టాదారు పాస్ బుక్ కలిగిన వారు 619 ఉండగా 587 మంది పెండింగ్‌లో ఉన్నాయని, 22 ఆన్ లైన్ లో నమోదు చేసినట్లు పేర్కొన్నారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఈఓలు ప్రవీణ్ యాదవ్, పూజ, సమజాత, రవళి, రైతులు పాల్గొన్నారు.

పోస్టల్‌లో భీమా చేయండి.. ధీమాగా ఉండండి

-డివిజన్ హెడ్ ఆఫీసర్ నికేష్ యాదవ్

నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్



పోస్ట్ ఆఫీస్‌లో బీమా చేసి ధీమగా ఉండాలని సిద్ధిపేట డివిజనల్ హెడ్ ఆఫీసర్ నికేష్ యాదవ్ అన్నారు. సిద్ధిపేట హెడ్ ఆఫీస్ లో హెడ్ పోస్ట్ మాస్టర్ శ్రీనివాస్ అసిస్టెంట్ సూపర్డెంట్ హర్షవర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోస్ట్ ఆఫీస్ మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోస్టల్ డిపార్ట్మెంట్ కు సంబంధించిన పొదుపు పథకాలు బీమాకు సంబంధించిన పథకాలపై అవగాహన కల్పించారు. పోస్ట్ ఆఫీస్ లో నెల ఇన్కమ్ స్కీమ్ సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ సుకన్య సమృద్ధి యోజన ఫిఫ్టీన్ ఇయర్స్ పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఫైవ్ ఇయర్స్ నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు కిసాన్ వికాస్ పత్రాలు అటల్ పెన్షన్ యోజన సురక్ష బీమా యోజన ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమ యోజన లాంటి పథకాలు ఉన్నాయని వాటిని ఖాతాదారులు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఏ జెడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-కొండపాక



గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని కుకునూరుపల్లి పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్సై శ్రీనివాస్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కుకునూరు పల్లి మండలం మేదినిపూర్ శివారులో సంతోష్ కుమార్ డైరీ ఫామ్‌లో నివాసముంటున్న బీహార్ రాష్ట్రం పాట్నాకు చెందిన సుధీర్ కుమార్ మేదినిపూర్ గ్రామ శివారులోని పెద్దమ్మ దేవాలయం వద్ద గంజాయి సరఫరా చేస్తున్నాడని సమాచారంతో వెళ్ళగా పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నం చేసే క్రమంలో అతన్ని పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న బ్యాగులు సోదా చేయగా గంజాయి లభించింది. 109 గ్రాములగంజాయిని స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

-కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలయ్య

నవతెలంగాణ-అక్కన్నపేట



ఈనెల 30న అక్కన్నపేట మండల కేంద్రంలో శంకర నేత్రాలయ వారి ఆధ్వర్యంలో నిర్వహించబోయే క్యాటరాక్ట్ నేత్ర వైద్య శిబిరాన్ని మండలం లోని ప్రజలంతా ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 146, అక్కన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 213 మంది కంటి సమస్యలతో బాధపడుతున్నరన్నారు. వీరంతా తప్పనిసరిగా ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకొని కంటి సమస్యలు నయం చేసుకోవాలని తెలిపారు.

పదవులు లేకున్నా ప్రజల్లో ఉంటా..

నవతెలంగాణ-గజ్వేల్



పదవులు లేకున్నా ప్రజల్లోనే ఉంటానని మున్సి పల్ పరిధిలోని 12వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ అత్తిలి శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాత్రి వార్డులో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను వార్డు నుండి గెలిపించి మున్సిపాల్‌కు పంపిస్తే సాధ్యమైన వరకు అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రజల సహకారంతోనే తాను గత ఎన్నికల్లో గెలిచినట్లు చెప్పారు.తనకు పదవి ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల్లో ఉండి వారి సమస్యలపై స్పందిస్తానని అన్నారు. ప్రజలసమస్యల పరిష్కారం కోసం నిరంతరంగా కృషి చేస్తానన్నారు.

గుండెపోటుతో యువకుడు మృతి

నవతెలంగాణ-మిరుదొడ్డి



గుండెపోటుతో యువకుడు మృతి చెందిన సంఘటన మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సుంకరి రమేష్ (38) ఒకేసారి గుండెపోటు రావడంతో అక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మాధురి కొడుకు కృషివర్ధన్ కూతురు బోనాలు ఉన్నారు. కుటుంబ యజమాని మృతితో కుటుంబం అనాధలుగా మారారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మున్సిపల్ మాజీ చైర్మెన్‌కి ఘన సన్మానం

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సి పల్ తాజా మాజీ చైర్మెన్ ఎస్‌సీ రాజమౌళిని మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేసి లయన్స్ క్లబ్ జ్ఞాపిక అందజేశారు. అనంతరం లయన్స్ క్లబ్ సభ్యులకు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ప్రగతి నివేదిక పుస్తకాన్ని లయన్స్ క్లబ్ సభ్యులకు అందజేశారు. లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మెన్ గోలి సంతోష్ మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ గా 5 సంవత్సరాలు విజయవంతంగా పనిచేసిన రాజమౌళి ప్రజల మన్నలు పొందినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ లయన్ ఉప్పల మెట్టయ్య, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు మల్లేశం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ రావడం గర్వకారణం

-ములుగు మండల ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు ఆదాస్ మహేష్

నవతెలంగాణ-ములుగు



మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం దళిత జాతికి గర్వకారణమని ఎంఆర్పీఎస్ ములుగు మండలాధ్యక్షుడుఆదాసు మహేష్ అన్నారు. మందకృష్ణ మాదిగ అలుపెరగని పోరాట యోధుడని, అణగారిన వర్గాల పక్షాన వారి హక్కుల కొరకు పోరాడిన ధీరుడని కొనియాడారు. అటువంటి నిస్వార్థ దళిత నాయకుడికి పద్మశ్రీ రావడం చాలా సంతోషకరమని ఆయన అన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-సిద్ధిపేట



బాధితులకు కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దొంగల రాజి రెడ్డికి సీఎంఆర్ సహాయ నిధుల కింద రూ.60 వేలు, దేవి రెడ్డికి రూ.60వేలు, ఉడుత రేణుకా కి రూ.20వేల సీఎంఆర్ సహాయ నిధుల చెక్కులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ మండల సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ గుర్రం అంజి రెడ్డి, షాబుద్దీన్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి శివకుమార్, మహిళా జిల్లా అధ్యక్షులు ముద్ద లక్ష్మి, పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న డాక్టర్. ఎర్రోల్ల శ్రీనివాస్



నవతెలంగాణ-కొమురవెల్లి

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మెన్ ఎర్రోల్ల శ్రీనివాస్ మల్లికార్జున స్వామిని మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మల్లికార్జున స్వామి ఆలయం అద్భుతంగా అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మళ్లీ పూర్వ వైభవం వస్తుందని ఆకాంక్షించారు.ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఏర్పుల మహేష్, ఆలయ సూపరింటెండెంట్ రాములు, ఆంజనేయులు, తాంద్ర సాగర్, విరాట్ బాబు తదితరులున్నారు.

100 శాతం పన్నులు వసూలు చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్





నవతెలంగాణ-సిద్ధిపేటకలెక్టరేట్

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో 100శాతం పన్నులు వసూలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్ కమీషనర్ మరియు ఇతర సిబ్బందితో జిల్లా అదనపు కలెక్టర్ సమా వేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోనీ అన్ని మున్సిపాలిటీలలో ప్రాపర్టీ టాక్స్, షాప్ రెంట్స్, ట్రేడ్ లైసెన్స్ పీజు మరియు ఇతరత్రా పన్నులకు సంబంధించి 100శాతం వసూలు చేయాలని తెలిపారు. ఫిబ్రవరి పూర్తి అయ్యేవరకు పన్ను వసూల్లు పూర్తి చెయ్యాలన్నారు. రోజువారిగా పారిశుద్ధ్య కార్యక్రమాలను ఎలా పర్యవేక్షణ జరుగుతదో పెండింగ్ బకాయిలను సైతం వసూలు కూడా అదే ప్రాతిపదికన చెయ్యాలని మున్సిపల్ కమిషనర్లని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల మున్సిపల్ కమిషనర్లు నరసయ్య, రమేష్, మల్లికార్జున్, నాగేందర్, మెప్మా పీడీ హనుమంత్ రెడ్డి, సిద్దిపేట్ మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారుత

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు





నవతెలంగాణ-మర్కుక్

యువకులకు గంజాయి యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని మర్కుక్ ఏఎస్ఐ రవీందర్ సూచించారు. మండల కేంద్రమైన మర్కుక్ గ్రామంలో మంగళవారం జాతి రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మత్తు పదార్థాల వినియోగం ద్వారా నేడు యువత భవిష్యత్తు ప్రమాదంలో వుందని ఈ ప్రమాదం భారిన పడకుండా యువత అప్రమత్తంగా వుండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారులు నిబంధనలను పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దని తెలిపారు. వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్స్ డ్రైవింగ్ లైసెన్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ యువకులు ,గ్రామస్థులు ,తదితరులున్నారు.

సిద్ధిపేట : రోడ్డు నిబంధనలు పాటించాలని ఎంవీఐ శంకర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఆర్టీవో కార్యాలయం ప్రజలకు రోడ్డు నిబంధనలను వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదని, సీటు బెల్టు పెట్టుకోవాలని, హెల్మెట్ పెట్టుకోవాలని, అతివేగం పనికిరాదని, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయవద్దని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దుని, త్రిబుల్ రైడింగ్ చేయరాదని, మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమని, వాహనం నడిపేటప్పుడు వాహనకు సంబంధించిన డాక్యుమెంట్స్ , డ్రైవింగ్ లైసెన్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 20 ఏండ్ల పాటు ప్రోటోకాల్ ఉల్లంఘన

- గ్రామ ప్రజల కోరిక మేరకు ప్రొసీడింగ్ పత్రాల అందజేత
- టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి



నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట నియోజకవర్గంలో 20 ఏండ్ల పాటు ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగిందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి విమర్శించారు. మంగళవారం నంగునూరు మండల కేంద్రంలోని సాయి బాలాజీ ఫంక్షన్ హల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. కొంతమంది బీఆర్ఎస్ నాయకులు కలెక్టర్‌ను నిన్న ప్రోటోకాల్ గురించి ఫిర్యాదు చెయ్యడం దెయ్యాలు వేదాలు మళ్ళించి నట్టు ఉందని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాల పత్రాలను తీసుకుంటామని అధికారులకు చెప్పి వారి ద్వారా తీసుకోవడం జరిగిందని ఇందులో అధికారులకు ఎలాంటి సంభందం లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కడుపు మండి చిల్లర రాజకీయాలకు దిగుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తప్పెట శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అచ్చిన సత్తయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు అనరాజు నాగరాజు,యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు బాగు శ్రీకాంత్ యాదవ్, ఎనగందుల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

కులదురంహకార హత్యలను ఆరికట్టండి

- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

సూర్యాపేట జిల్లా కేంద్రంలో దళిత యువకుడు వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి (32) కులదురంహకార(పరువు)హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, రాష్ట్రంలో కుల వివక్షను ,కుల దురంహకర హత్యలను అరికట్టాలని,కులాంతర వివాహ జంటలకు రక్షణ కల్పించాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్రకార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం దళితుల పట్ల జరుగుతున్న అన్యాయాల గురించి మీడియాతో మాట్లాడారు. సూర్యపేట జిల్లా కేంద్రంలో ని మామిండ్ల గడ్డ ప్రాంతంలో నివసిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి దళిత యువకుడు వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి(32), సూర్యపేట తాళ్ళగడ్డకు చెందిన గౌడ కులానికి చెందిన బార్గవిని కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నాడు.నాటి నుంచి బార్గవి కుటుంబం కృష్ణను చంపాలని చూస్తున్నారు. పథకం ప్రకారం బార్గవి సొదరుడు నవిన్ తన మిత్రులతో కలిసి కృష్ణను ఒ ఇంట్లో బంధించి కండ్లలలో పొడిచి హింసించి ఉరి వెసి హత్య చెశారన్నారు. ఇలా వరుసగా జరుగుతున్న కులదురం హకార హత్యలను ఆరికట్టాలని, కులాంతర వివాహం చేసుకున్న జంటలకు రక్షణ కల్పించాలని రాష్ట్రంలో కుల వివక్షతను నిర్మూలించెందకు పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి ప్రజలకు అవగహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు, పాల్గొన్నారు.

నేడు వెంకట్రావుపేటలో మాఘ అమావాస్య జాతర

నవతెలంగాణ-తొగుట



మండలంలోని వెంకట్రావ్ పేట గ్రామ శివారులో కూడవెల్లి వాగుకు ఒడ్డున పచ్చని పంట పొలాల చెంత గుట్టల మధ్య వెలిసిన వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బుధవారం జరిగే జాతరాకు ముస్తాబైంది. ప్రతి ఏటా మాఘమా మవాస్య సందర్భంగా ఇక్కడ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. కోరిన కోర్కెలు తీర్చే ప్రజల ఆరాధ్య దైవంగా భావించే కలియుగ భగవానుడు వెంకటేశ్వర స్వామిని గ్రామం లోని వేణు గోపాల స్వామి దేవాయలం నుండి షావ ద్వారా ఊరేగింపు గా ఇక్కడికి తీసుకువోస్తారు.ఆలయం ప్రక్క నే ఉన్న యోగేశ్వరాలయం చుట్టూ మామిడి, కొబ్బరి ఆకులతో అలంకరించిన ఎడ్ల బండ్ల ఊరే గింపు కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తారు. జాతరకు తొగుట మండలంలోని అధిక సంఖ్యలో భక్తులు విచ్చేయనున్నారు. ఈ ఈ జాతరలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొననున్నారని మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి మంగళ వారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జాతరకు కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి విచ్చే స్తున్నారని వెంకట్రావుపేట కాంగ్రెస్ సీనియ ర్ నాయకులు పంది రాజు మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-వర్గల్



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని అనంతగిరి పల్లి శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం గ్రామానికి చెందిన వెంకట్ (46) మధ్యాహ్నం 2 గంటలకు తుప్రాన్‌కి వెళ్ళాడు. సాయంత్రం 4 గంటల సమయంలో తిరిగి నాచారం వెళ్తుండగా ఎదురుగా లారీ డ్రైవర్ అజాగ్రత్తగా వేగంతో దూసుకొస్తూ వెంకట్ ద్విచక్ర వాహనాన్ని 'ఢీ' కొట్టాడు. వెంకట్ తలకు బలమైన గాయం తగలడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం అంబేద్కర్ చౌరస్తా వద్ద మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సంఘస్థాపకుడు మందకృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును అందించిన సందర్భంగా అక్కన్నపేట ఎమ్మార్పీఎస్, ఏపీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. పద్మశ్రీ అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్యామ్ కిరణ్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు జన్న రవీందర్ మాదిగ, జాల సురేష్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఇంటర్ పరీక్షల సమన్వయ కమిటీ సమావేశం

నవతెలంగాణ-సిద్ధిపేటకలెక్టరేట్



జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు జిల్లా కలెక్టర్ (రెవిన్యూ) అబ్దుల్ హమీద్ ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షల కమిటి సిద్ధిపేట సమన్వయ సమావేశం సంబందిత శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించారు. సమావేశంలో రెవిన్యూ, పోలీస్, వైద్య, విద్యుత్, పాఠశాల విద్య, పోస్టాఫీసు / తపాల, మిషన్ భగీరథ జిల్లా స్తాయీ అధికారులతో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సమన్వయ సమీక్షను నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు 2025 ఫిబ్రవరీ03 నుంచి 2025 ఫిబ్రవరి 22 వరకు 62 కేంద్రాల్లో సుమారు జనరల్ (5909), వొకేషనల్ (5182) మొత్తం 11091 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. మార్చిలో జరిగే వార్షిక పరీక్షల్లో జిల్లా నుంచి ప్రథమ సంవత్సరంలో 9770, ద్వితీయ సంవత్సరంలో 10875 మంది విద్యార్థులు 2025 మార్చి 05 నుంచి 2025 మార్చి 25 వరకు 43 పరీక్షా కేంద్రాల్లో జరగనున్నాయని వివరించారు. పరీక్షలు విజయవంతంగా జరగడానికి అన్ని శాఖలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా గౌరవ అదనపు జిల్లా కలెక్టర్ (రెవిన్యూ) గారు ముఖ్యమైన శాఖాధికారులకు పరీక్షలను సక్రమంగా నిర్వహించడానికి ఆయా శాఖలు తీసుకోవలసిన తగు చర్యలు మరి జాగ్రత్తలను చేపట్టాలని తెలిపారు.

ఖబర్దార్ బండి సంజయ్..!

- ప్రజా సంఘాలు, జేఏసీ నాయకుల రాస్తారోకో
- బ్రండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ప్రజా యుద్ధనౌక గద్దర్ పైన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని వెంటనే క్షమాపణ చెప్పాలని బండి సంజయ్ ఖబర్దార్ అని ప్రజా సంఘాలు, జేఏసీ నాయకులు హెచ్చరించారు. కేంద్ర హెూం సహాయ మంత్రి బండి సంజయ్ మీడియాతో ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు పద్మశ్రీ అవార్డు ఇవ్వమని బీజేపీ కార్యకర్తలను హత్య చేయించారని రెచ్చగొట్టేలా తీవ్రస్థాయిలో అవమానించేల మాట్లాడటంపై మంగళవారం హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో పెద్ద ఎత్తున రాస్తారోకో చేసి బండి సంజయ్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బండి సంజయ్‌ని మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య యుత పదవిలో ఉండి ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా కళా రంగంలో ఎంతోమందికి ఆదర్శంగా నిలిచిన మహెూన్నతమైన వ్యక్తిని అవమానపరచడం బండి సంజయ్ అహంకారం అన్నారు. గద్దర్ గౌరవాన్ని పెంచి వెంటనే బండి సంజయ్ తో బహుజనులకు క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడెం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, జేఏసీ కోఆర్డినేటర్లు మేకల వీరన్న యాదవ్, దేగల సారయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్క అనిల్ గౌడ్, జేఏస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-గజ్వేల్





మాదక ద్రవ్యాలకు యువత దూరముండాలని నెహ్రూ యువ కేంద్రంప్రోగ్రాం ఇన్చార్జి కిరణ్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గజ్వేల్‌లో జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్ర మెదక్ జిల్లా వారి సౌజన్యంతో విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా వైద్య విభాగం సూపరిండెంట్, మనోవైజ్ఞానిక శాస్త్ర వైద్య నిపుణురాలు ప్రొఫెసర్ డాక్టర్ శాంతి హాజరై మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే దుష్పరిణామాలను వాటి నుండి దూరంగా ఉండాల్సిన విధానాల గురించి విద్యార్థులకు వివరించారు. ఇదే కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా పాల్గొన్న గజ్వేల్ పట్టణ ట్రాఫిక్ సిఐ విద్యార్థులకు ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన కలిగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నికత్ అంజు మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా సాంస్కృతిక విభాగ బృందం పాటల రూపంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణ పట్ల అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ చైర్మన్ చంటి, నశాముక్త భారత్ కార్యక్రమం నిర్వాహకులు మురళి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతి రావు పాల్గొన్నారు.

స్థానిక ఆధారంగా ఉపాధ్యాయుల రీ అలకేషన్ చేపట్టాలి

- జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ గజ్వేల్ మండల శాఖ ఆధ్వర్యంలో సమస్యల సేకరణ కార్యక్రమం చేపట్టారు. మండలంలోని ముట్రాజుపల్లి, ఆర్అండ్ఆర్ కాలనీ, సంగాపూర్, బాయ్స్ హబ్, గర్ల్స్ హబ్‌లోని ఉన్నత పాఠశాలలు, బంగ్లా వెంకటాపూర్, మక్త మసాన్‌పల్లి, రంగంపేట్, కోమటి బండ, ధర్మారెడ్డి పల్లి, గిరిపల్లి, జాలిగామ తదితర పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ మాట్లాడుతూ రాష్ట్రం లో 317 జీవో ద్వారా ఉపాధ్యాయులను స్థానికత కోల్పోయేలా ఇతర జిల్లాలకు కేటాయించడం అన్యాయమన్నారు. స్థానికత ఆధారంగా వెంటనే వారిని సొంత జిల్లాలకు రీ అలకేషన్ చేయాలనీ డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 కింద నెల మొదటి తారీఖున వేతనాలు చెల్లించాలని, సర్వీస్ రూల్స్ రూపొందించి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జల్లెల శ్రీనివాస్, జిల్లా కౌన్సిలర్ దమ్మని మల్లయ్య,మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాళ్ల నాగరాజు, గోక విద్యా సాగర్,సీనియర్ నాయకులు పెంటయ్య,పర్వతం నర్సయ్య,శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల కోసమే యూపీఎస్

- కేంద్ర ప్రభుత్వం నిర్ణయంపై ఉపాధ్యాయుల ఆగ్రహం



నవతెలంగాణ-గజ్వేల్

జనవరి 24న ఆర్థిక శాఖ కేంద్ర ఆర్థిక శాఖ యూనిఫైడ్ పెన్షన్ విధానంపై జారీచేసిన నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర కంట్రీబ్యూటరీ పెన్షన్స్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో యూపీఎస్ ప్రతులను దగ్ధం చేస్తూ తీవ్ర నిరసనలు జరిగాయి. భోజన విరామ సమయంలో గజ్వేల్ బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మల్లికార్జున్,డివిజన్ అధ్యక్షులు రాజు మాట్లాడుతూ పీపీ ఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ పునరుదించాలన్నారు. యూపీఎస్ విధానం వల్ల ఉద్యోగి తన సర్వీస్ కాలంలో జమ చేసిన ప్రతినెల బేసిక్ ప్లస్ డి ఏ లో 10 శాతం చొప్పున జమ చేసిన సొమ్మును ఎన్పీఎస్ ట్రస్ట్ కు బదిలీ చేసిన తర్వాతనే ఉద్యోగికి సర్వీస్ పెన్షన్ నిర్ణయించడం అనేది అత్యంత దారుణమైన చర్య అని దీన్ని సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులందరూ కూడా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు కంట్రిబ్యూషన్ లేకుండా పెన్షన్ అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని సుప్రీంకోర్టు నకారా కేసును గుర్తు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్, లెక్చరర్ లు ప్రకాష్,రాజీ రెడ్డి,అబ్దుల్, మల్లేశం, నరేష్ రెడ్డి, మాధురి, తదితరులు పాల్గొన్నారు.

రిమ్మనిగూడ ప్రాథమిక పాఠశాలలో..కేంద్ర ప్రభుత్వం పెన్షన్ విషయంలో తీసుకున్న నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు మంగళవారం మండిపడ్డాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలలో భోజన విరామం సమయంలో యూపీఎస్ పత్రాలను పాఠశాల ముందు దగ్ధం చేసి పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేశారు. ఈ పెన్షన్ విధానం వల్ల ఉద్యోగుల భవిష్యత్ అగమ్య గోచరంగా తయారు అయిందని తెలియజేశారు. ఈ నిరసన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘ గజ్వేల్ మండల ప్రధాన కార్యదర్శి చెన్న సురేష్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిమ్మనిగూడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నాగభూషణం, భద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి

- రూరల్ సీఐ శ్రీనివాస్

నవతెలంగాణ-సిద్ధిపేట

క్రీడలు మనసిక ఉల్లాసానికి, శారీరక ధృఢత్వానికి దోహదపడతాయని రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతులను పురస్కరించుకొని యువకులకు వివిధ ఆటల పోటీలను రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీరామ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28 నుండి 30 వరకు ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుత సమాజంలో యువకులు, విద్యార్థులు మత్తు, మాదకద్రవ్యాలు, మొబైల్ ఫోన్స్ కి అలవాటు పడి గ్రౌండ్లకి దూరమయ్యారని, ఒంటరితనానికి అలవాటు పడుతూ, విద్యార్థులు సమాజం లో కలివిడిగా ఉండలేక చిన్న చిన్న విషయాలకు ఆత్మహత్యలు చేసుకుంటున్నరని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వివేక్, రాష్ట్ర ఖేల్ కో కన్వీనర్ ప్రశాంత్, నగర కార్యదర్శి పరుశరామ్, సిద్దిపేట ఖేల్ కన్వీనర్ సాయి శంకర్, తేజస్వి, శ్రవణ్, అభి, లోకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



కులదురంహకార హత్యలను ఆరికట్టండి

- డిబిఎఫ్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్



నవతెలంగాణ-నిజాంపేట్

సూర్యాపేట జిల్లా కేంద్రంలో దళిత యువకుడు వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి (32)కుల దురంహకార (పరువు హత్య) చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని దళిత బహుజన ఫ్రంట్(డిబిఎఫ్) జిల్లా అధ్యక్షులు డి సంజీవ్ డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మామిండ్ల గడ్డ ప్రాంతంలో నివసిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి దళిత యువకుడు వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి (32) సూర్యపేట తాళ్ళగడ్డకు చెందిన గౌడ కులానికి చెందిన బార్గవిని గత 5 నెలల కింద నకిరేకల్‌లో ప్రేమ వివాహం చేసుకున్నాడన్నారు. కులదుంహంకారంతో బంటిని హత్య చేశారన్నారు. అదేవిధంగా ఇటీవల రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో దళిత యువకుడు శ్రీకాంత్ ను కులాంతర వివాహం చేసుకున్న మహిళ కానిస్టేబుల్‌నే తన తమ్ముడు అత్యంత దారుణంగా హత్య చేశాడని గుర్తు చేశారు. వరుసగా జరుగుతున్న కులదురంహకార హత్యలను ఆరికట్టాలని, కులాంతర వివాహం చేసుకున్న జంటలకు రక్షణ కల్పించాలని, రాష్ట్రంలో కుల వివక్షత ను నిర్మూలించేందుకు ప్రణాళికబద్ధంగా ప్రతినెల చివరన పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి ప్రజలకు అవగహన కల్పించాలని కోరారు.

గూడూరు శ్రీగురుపీఠంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-శివ్వంపేట



ఆధ్యాత్మికతకు మారుపేరుగా వెలుగొందబోతున్న మండలంలోని గూడూరు గ్రామంలో స్వర్గీయ జిన్నారం పెద్దగోని లింగయ్య గౌడ్, అంజమ్మ స్మారకార్థం శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మితమవుతున్న శ్రీగురుపీఠంలో అమావాస్య పర్వదినం సందర్భంగా మంగళవారం శ్రీగురుపీఠం ప్రధాన అర్చకులు వంశీకృష్ణ గురుపూజ, శ్రీదత్తాత్రేయ స్వామికి, శ్రీసమర్థ సద్గురు షిరిడి శ్రీసాయినాథ స్వామికి విశేష అభిషేకములు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ గురువును అన్నివిధాలా పూజించాలనే ముఖ్య ఉద్దేశ్యంతోనే దేశంలోనే మొట్టమొదటిసారిగా గూడూరు గ్రామంలో ఐదు మంది స్వాములకు ఒకే చోట దత్తపంచాయతనం నిర్మించడం కోసమే శ్రీగురుపీఠం నిర్మాణం చేపట్టడం జరిగినదన్నారు. సాయినాథుని గుడి నిర్మాణంలో విరాళాలు అందజేసే స్వామివారి భక్తులు ఆన్ లైన్ ద్వారా కూడ విరాళాలను అందజేయవచ్చునని ఆయన తెలిపారు. ప్రత్యేక పూజలలో ట్రస్ట్ సభ్యులు జిన్నారం పెద్దగోని సూర్యంకుమార్ గౌడ్, కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్, శ్రీనివాస్, బ్రహ్మచారి పాల్గొన్నారు.

బగలాముఖీ శక్తిపీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

- పీతవర్ణ వస్త్రాలతో అమ్మవారికి అలంకరణ

నవతెలంగాణ-శివ్వంపేట



ప్రపంచంలోనే ఎక్కడ లేని విధంగా, దేశంలోనే మొదటిసారిగా, ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ప్రప్రథమంగా నిర్మితమైన, అత్యంత శక్తిపీఠాలలో ఒకటైన శివ్వంపేట శ్రీబగలాముఖీ శక్తిపీఠంలో బగలాముఖీ అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు మహాపూజలు నిర్వహించారు. అమ్మవారి ఉపాసకులు, బ్రహ్మర్షి శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో శక్తిపీఠం ప్రధాన అర్చకులు కమలేష్ పండిత్ బగలాముఖీ అమ్మవారిని పీతవర్ణ పుష్పాలు, పీతవర్ణ వస్త్రాలతో విశేషంగా అలంకరించి, అమ్మవారికి మహాపూజలు, రుద్రయామల బగలా అష్టోత్తర నామార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి ప్రీతిపాత్రమైన పసుపుతో అర్చన హరిద్రార్చన నిర్వహించడమే కాకుండా అభిషేకం, మంగళహారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించి, వివిధ రకాల ఫలాలతో నైవేద్యం సమర్పించారు. బగలాముఖీ అమ్మవారిని దర్శనం చేసుకునేందుకు హాజరైన భక్తులు మొక్కులు చెల్లించుకోగా, ప్రధాన అర్చకులు కమలేష్ పండిత్ భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ప్రత్యేక పూజలలో బగలాముఖీ ట్రస్ట్ అధికార సభ్యులు సూర్యకుమార్ గౌడ్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు కాముని నగేష్, నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు ఉప్పల ప్రకాష్, కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్, రాజీపేట కిషన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం





నవతెలంగాణ-శివ్వంపేట

కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అందించే అరుదైన గౌరవం పద్మశ్రీ అవార్డు గ్రహీత సామాజిక హక్కుల పోరాట యోధుడు, దండోరా దళపతి మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి మంగళవారం మండలంలోని పిల్లుట్ల గ్రామంలో అంబేద్కర్ యూత్, ఎంఆర్పీఎస్ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అణగారిన పీడిత వర్గాల హక్కులు, ఏబీసీడి వర్గీకరణ కోసం ఎన్నో ఏండ్లుగా పోరాటాలు చేస్తున్న మంద కృష్ణ మాదిగ సేవలను కొనియాడారు. అంతకు ముందు మంద కృష్ణ మాదిగ పోరాటాలపై గ్రామంలోని ప్రధాన వీధులగుండా కళాకారులూ ఆటపాటలతో ఉర్రుతలూగించారు. జైభీమ్ నినాదాలతో ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దండోరా నాయకులు ముంద్రాతి స్వామి, ఈరన్ రాజు, దాసరి నర్సిములు, డప్పు వెంకటేష్, దాసరి వీరేష్, దాసరి కుమార్, పోతిరెడ్డిపల్లి స్వామి, పాల్గొన్నారు.

నవతెలంగాణ-వెల్దుర్తి

తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాలుగు పథకాలను మండల పరిధి ధర్మారం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎన్నిక చేసి గ్రామంలో ఉన్న ప్రతి లబ్ధిదారుని ఎంపిక చేసి అందరికీ నాలుగు పథకాలను మంజూరు చేసి అమలు పరిచిన సందర్భంగా మంగళవారం మండల పరిధి ధర్మారం గ్రామంలో గ్రామానికి చెందిన మహిళలు పురుషులు కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 100% శాతం అర్హులైన నిరుపేదలకు నాలుగు పథకాలు పూర్తిస్థాయిలో మంజూరు చేసి బాండ్లను అందించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతగా ఉన్నామన్నారు.

పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

మండలంలోని పీహెచ్‌సీని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని రక్త పరీక్షల గది, మందులు అందజేసే గది, ఇన్ పేషెంట్ వార్డ్, బెడ్స్, టాయిలెట్స్, వాక్సినేషన్‌ను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి రోజు ఆసుపత్రికి ఎంత మంది రోగులు వస్తున్నారని, ఈ నెలలో ఎన్ని డెలివరీలు జరిగాయని డాక్టర్ సాయి సింధూను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హత లేనోళ్లకేం ప్రోటోకాల్ విలువలు తెలుస్తాయి

- మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ.



నవతెలంగాణ-శివ్వంపేట: రాజ్యాంగ బద్దంగా ఒక్క పదవీకి గాని వార్డు మెంబర్‌కు ఎన్నికకానీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డికి ప్రోటోకాల్ విలువలేమి తెలుస్తాయని ఎంపీపీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అర్హత లేనోళ్లకు రాజ్యాంగ విలువలు, అధికార ప్రోటోకాల్ విలువలేం తెలుస్తాయని ఆయన ప్రశ్నించారు. దాడులను ప్రోత్సాహిస్తామంటే ప్రతి దాడులు చేయడానికి మేమేం భయపడమని ఆయన హెచ్చరించారు. ప్రజాక్షేత్రంలో ప్రజాధరణతో చట్టసభకు ఏమ్మెల్యేగా ఎన్నికైన సునీతారెడ్డిపై అనుచిత వాక్యాలు చేస్తే ఊరుకోబోమని,ఎమ్మెల్యే వెంట ఉండే మేమంతా దేనికైనా సిద్ధమేనన్నారు.నాయకత్వ లక్షణాలు లేని మిడి మిడి జ్ఞానం కలిగిన ఆవుల రాజిరెడ్డి కాంగ్రెస్ పార్టీని భ్రబష్టు పట్టించి, గ్రామాలలో చిల్లర రాజకీయాలు చేస్తూ, తానేదో పెద్ద నాయకుడినని దాడుల సంస్కృతిని ప్రోత్సాహిస్తానంటే నువ్వు ఏఊరికి వస్తావో చెప్పు, మేము అక్కడికి వస్తాము.. నువ్వో మేమో తేల్చుకుందామని ఆయన సవాల్ విసిరారు. పెద్ద మనిషిలా వ్యవహరిస్తానంటే మంచిదే గాని చిల్లర వేశాలేస్తానంటే మీకు బుద్ధి చెప్పడం ఖాయమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నర్సింగరావు, సింగాయిపల్లి నారాయణరావు,మాజీ సర్పంచ్ సోము అశోక్, కర్రె బిక్షపతి, లక్ష్మీనర్సయ్య,దొడ్ల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు

నవతెలంగాణ-నార్సింగి



మండల పరిధి గ్రామమైన నర్సంపల్లిలోని ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజనాన్ని దుబ్బాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు హుస్సాముద్దీన్ తనిఖీ చేశారు. స్టోర్ రూం లోని కూరగాయలు, వంట సరుకులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం విషయాన్ని విద్యార్థులను అది తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు భోజనంలో రుచి, శుభ్రత, నాణ్యత విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని, పౌష్టికాహారాన్ని అందించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. తల్లిదండ్రులకు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, చదివించే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు బొల్లా ప్రశాంత్, చేగుంట మండల ఉపాధ్యక్షుడు బోయిని శ్రీకాంత్, నార్సింగి యూత్ కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్లైన్ మోసాలపై అవగాహన

- అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పొద్దు
- లోన్ యాప్లను నమ్మొద్దు
- ఎస్సై శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-నిజాంపేట

చాలామంది ఆన్లైన్ మోసాలకు బలై తమ డబ్బులను, ప్రాణాలను కోల్పోతున్నారని స్థానిక ఎస్సై శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ప్రజలకు ఆన్లైన్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా బ్యాంక్ అధికారులమంటూ ఫోన్ చేసి ఓటీపీలు, బ్యాంకు నంబర్లు, ఆధార్ నంబరు, ఇతర వివరాలు అడిగితే ఎవరికి చెప్పవద్దన్నారు. అలాగే చాలామంది యువత లోన్ ఆప్ ద్వారా డబ్బులు తీసుకొని వారి వేధింపులు తాళలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని లోన్ ఆప్‌లను ఎవరు నమ్మవద్దన్నారు. అలాగే వాహనాలు నడిపే ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ను ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జైపాల్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్స్ సునీత, కానిస్టేబుల్స్, ప్రజలు పాల్గొన్నారు.



రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు

ఎమ్మెల్యే సునీత రెడ్డి

నవతెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్ల మరమ్మత్తుల కోసం రూ.5.37 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే సునీత రెడ్డి తెలిపారు. ఎంఎంఆర్ నిధుల కింద జీవో ఆర్టీ నంబర్ 59 ద్వారా నర్సాపూర్ మండలం ఎన్ఎన్‌టి రుస్తుంపేట్ రోడ్డు నుంచి మూసాపేట్, నాగులపల్లి, గ్రామాల మీదుగా హత్నూర మండలం సికింద్రాపూర్ రోడ్డు వరకు 9.53 కిలోమీటర్లకు గాను రూ. 5.37 లక్షలు మంజూరు అయ్యాయని తెలిఆరు. త్వరలో పనులు ప్రారంభిస్తామని ఆమె తెలిపారు.



నవతెలంగాణ
సంగారెడ్డి
బుధవారం | 29-01-2025 | www.navatelangana.com

సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల ముగింపు దృశ్యమాలిక.1































సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల ముగింపు దృశ్యమాలిక.2













